ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 25 జూలై 2025

దళారుల రాజ్యం


విస్తారంగా పండిన బొప్పాయి కాయలు

- బావురుమంటున్న బొప్పాయి రైతు
- అమాంతంగా ధరలు తగ్గింపు
- చిట్వేలి, ఓబులవారిపల్లెల్లో రోడ్డెక్కిన రైతులు
- ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్
- కోడూరు, రాజంపేట ప్రాంతాల్లో 30 వేల ఎకరాల్లో బొప్పాయి సాగు

అక్కడ దళారులదే రాజ్యం.. వారు చెప్పిందే ధర.. రాజంపేట డివిజన్‌లో దళారుల వల్ల బొప్పాయి రైతులు భారీగా నష్టపోతున్నారు. టన్ను రూ.16 వేలు ఉన్న ధరను ఒక్కసారిగా 12 వేలకు తగ్గించేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన వ్యాపారులు, ఇక్కడి దళారులు కుమ్మక్కై టన్నుకు రూ.4 వేలు తగ్గించేశారు. దీంతో బుధవారం చిట్వేలి, ఓబులవారిపల్లె ప్రాంతాల్లో రైతులు బొప్పాయి ధరలు పెంచాలని రోడ్డుపై బైఠాయించారు.


బొప్పాయి కాయలు


చిట్వేలిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

రాజంపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో సుమారు 30 వేల ఎకరాల్లో బొప్పాయి పంట సాగైంది. 15 రోజులుగా బొప్పాయి కాయలు కోత కోస్తున్నారు. 15 రోజుల నుంచి రోజూ 30 లారీలకు పైబడి ఎగుమతి అవుతున్నాయి. ఈ స్థితిలో టన్ను ధర రూ.16 వేల వరకు పలికింది. ధర ఇంకా పెరిగి రూ.20 వేల వరకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో ఒక్కసారిగా రూ.12 వేలకు తగ్గిపోయింది. వ్యాపారులు, దళారులు ఢిల్లీ నుంచి ఇక్కడికి తరలివచ్చారు. వీరందరూ కుమ్మక్కై టన్నుకు 4 వేల రూపాయలు రేటు తగ్గించేశారు. ధరలు మరింత తగ్గే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రోజూ 30 లారీల దిగుబడి వస్తుండగా రానున్న రోజుల్లో రోజుకు 150 లారీల నుంచి 200 లారీల వరకు దిగుబడి అయ్యే అవకాశం ఉంది. అక్టోబరు నెలాఖరు వరకు మూడు నెలల పాటు బొప్పాయి కాయలు దిగుబడి అవుతూనే ఉంటాయి. జాతీయ మార్కెట్‌లో రాజంపేట, రైల్వేకోడూరు నుంచి పంపిన బొప్పాయికి మంచి డిమాండ్ ఉంటుంది. ప్రతి ఎకరాకు 20టన్నులు తక్కువ కాకుండా దిగుబడి వస్తాయి. ఎకరాకు 70వేల వరకు ఖర్చు అవుతుంది. టన్ను రూ.10 వేలు పలికినా 20 టన్నులకు రెండు లక్షల రూపాయలు వరకు గిట్టుబాటు లభిస్తుంది. ఖర్చులు పోను 1.50 లక్షల నుంచి 2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. దేశంలోని అన్ని ప్రధాన పట్టణాలకు ఈ కాయలు ఎగుమతి అవుతుంటాయి. ఎక్కువగా ఢిల్లీ నుంచి వ్యాపారులు అధిక సంఖ్యలో కోడూరు ప్రాంతానికి వచ్చి ముందుగానే పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేస్తుంటారు. సుమారు 200 మంది వ్యాపారులు ఢిల్లీ నుంచి వచ్చి వ్యాపారం చేస్తూ ఉంటారు. అక్కడి వ్యాపారులే కాకుండా ఇక్కడ ఊరికో దళారీ ఈ వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారులకు రైతులకు దళారులు అనుసంధానంగా ఉండి రేటును నిర్ణయిస్తుంటారు. 15 రోజులుగా టన్ను ధర రూ.16 వేలు వరకు ఉండడంతో ఈ ధరలు మరింత పెరుగుతాయని రైతులు ఆనందంలో ఉన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడం, కాయలు అధిక మోతాదులో ఒకేసారి దిగుమతి కావడం, డిమాండ్‌కు మించి కాయలు కోతలకు రావడంతో కాయల రేటు తగ్గడానికి కూడా ఓ ప్రధాన కారణంగా చెబుతున్నారు. వ్యాపారులు, దళారులు కుమ్మక్కై ధరలు ఒక్కసారిగా తగ్గించడంతో బొప్పాయి రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

రోడ్డెక్కిన రైతులు

బొప్పాయి ధరలను అమాంతం తగ్గించడంతో ఏమీ చేయలేని పరిస్థితిలో రైతులు గురువారం ఆందోళనకు దిగారు. చిట్వేలి, ఓబులవారిపల్లె ప్రాంతాల్లో రైతులు రోడ్లపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. రైల్వేకోడూరు రాజంపేట ప్రాంతంలో సుమారు 30 వేల ఎకరాల్లో 20 వేల మంది రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. దళారులు, వ్యాపారులు కుమ్మక్కు కావడం వల్ల ఒక్కసారిగా ధరలు తగ్గించారని వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకుని బొప్పాయి ధరలు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి..



బొప్పాయి ధరలను ఒక్కసారిగా తగ్గించిన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. దళారులు, వ్యాపారులు కుమ్మక్కు కావడం వల్లే ఒక్కసారిగా ధరలు తగ్గించారు. ఆరుగాలం కష్టించి ఇంటిల్లిపాది కష్టపడి ఈ పంటను సాగు చేశాం. నేను రెండెకరాల్లో బొప్పాయి సాగు చేశాను. బాగా ధరలున్నాయన్న పరిస్థితిలో ఒక్కసారిగా టన్నుకు 4 వేలు తగ్గించడం దారుణం.

- పాటూరు సుబ్బరామిరెడ్డి, బొప్పాయి రైతు, నగిరిపాడు, చిట్వేలి మండలం

ధరల నియంత్రణపై చర్యలు చేపట్టాలి..



ధరల నియంత్రణపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో ఉద్యానవన పంటలు ప్రధానమైనవి. మామిడి కిలో రూ.4 కూడా అమ్మకపోవడంతో పెట్టుబడి కూడా రాలేదు. అరటి ధర బాగా ఉన్న పరిస్థితుల్లో దళారులు ప్రవేశించారు. ధరలు పెరగకుండా చేశారు. ఇదే స్థితిలో బొప్పాయి పంటకు కూడా ధరలు లేకుండా చేస్తున్నారు. పండిన పంటను నిల్వ చేసుకునే కోల్డ్‌స్టోరేజిలు లేవు. పంట పక్వానికి వస్తే కోయక తప్పదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రైతుకు గిట్టుబాటు ధరలు లభించే విధంగా ధరల నియంత్రణ చేయాలి.

- బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, రైతు, రాజంపేట

విద్యార్థులను ప్రోత్సహించండి

- 3 వేల ప్రాజెక్టుల లక్ష్యం.. జిల్లాను అగ్రస్థానంలో నిలపండి
- కలెక్టర్ చామకూరి శ్రీధర్


ఇన్‌స్పైర్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీఈవో, జిల్లా సైన్స్ అధికారి తదితరులు

రాయచోటిటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు ఇన్‌స్పైర్ నామినేషన్లు సమర్పించేటట్లు విద్యార్థులను ప్రోత్సహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. గురువారం ఆయన విద్యాశాఖాధికారులతో కలిసి ఇన్‌స్పైర్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మనాక్ భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రధాన కార్యక్రమం అన్నారు. 6 నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థులను సైన్స్ ఆవిష్కరణల వైపు ప్రేరేపించడమే లక్ష్యంగా అవార్డులు ఇస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యపు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా నామినేషన్లు సమర్పించేటట్లు జిల్లా విద్యాశాఖాధికారులతో పాటు విద్యాశాఖ యంత్రాంగమంతా చొరవ చూపాలన్నారు. నామినేషన్లను సెప్టెంబర్ 15లోగా సమర్పించాలన్నారు. సమాజం ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలకు పరిష్కారం చూపే విధంగా విద్యార్థుల ఆలోచనల నుంచి పుట్టుకొచ్చిన ఆవిష్కరణలను నామినేషన్లుగా సమర్పించాలని సూచించారు. అత్యుత్తమ నామినేషన్లు సమర్పించిన ఒక్కొక్క విద్యార్థికి రూ.10 వేలు నగదు బహుమతి ఇస్తారన్నారు. జిల్లా నుంచి 3 వేల నామినేషన్లు సమర్పించడమే లక్ష్యంగా విద్యార్థులను ప్రేరేపించి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని ఆయన ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డీఈవో సుబ్రమణ్యం, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఆప్ కాస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ రవిశంకర్‌రెడ్డి, సైన్స్ సిటీ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వీరబల్లి డిప్యూటీ ఎంపీడీవో సస్పెన్షన్

వీరబల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లోని పంచాయతీ నిధులు దుర్వినియోగం పట్ల నిర్లక్ష్యం వహించారని మండల డిప్యూటీ ఎంపీడీవో రామచంద్రారెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సానిపాయి, తాటిగుంటపల్లి పంచాయతీల్లో నిధులు దుర్వినియోగమయ్యాయని, వాటిని పర్యవేక్షించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. దీనికి తోడు వంగిమళ్ల పంచాయతీలో ప్రత్యేక అధికారిగా ఉంటూ ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శికి తెలియకుండా ప్రభుత్వ నిధులను ఆయనే స్వయంగా డ్రా చేసినట్లు విచారణలో నిర్ధారణ అయిందన్నారు. తీవ్రమైన ఆరోపణల నేపథ్యంలో ఆయనపై తక్షణమే సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ఉన్నతాధికారులు ప్రకటించారు.

జాయింట్ ఎల్‌పీఎంలను మార్చుకోండి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్


రామాపురంలో జాయింట్ ఎల్పీఎం ఉన్నరైతులతో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రామాపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లెలో జాయింట్ ఎల్‌పీఎంలో ఉన్న భూములను గురువారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పరిశీలించారు. మండలంలోని నల్లగుట్టపల్లెలో సుమారు 413 ఎల్‌పీఎం సర్వే నెంబర్లు జాయింట్‌గా ఉన్న భూములను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడుతూ మీ భూములు పెద్దల కాలం నుంచి జాయింట్‌గా ఉన్నాయని, అందువల్ల ఎల్పీ నెంబర్లు మార్చుకోవాలని చెప్పగా దానికి రైతులు పెద్దల ఆస్తులు అలాగే ఉన్నాయని, కలిసి ఉంటే బాగుంటుందని మేము అనుకున్నామని చెప్పారు. ఇప్పటికైనా మీరు సమస్యలు పడకుండా భాగ పరిష్కారాలు చేసుకుని జాయింట్‌గా ఉన్న పట్టాలను పరిష్కరించుకుంటే బాగుంటుందని వారికి తెలిపారు. నెంబర్లు మార్చుకుంటే భూముల వద్ద ఎలాంటి గొడవలు రావని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సర్వేయర్‌లు వాసుదేవరెడ్డి, మౌలాని, వీఆర్‌వో కవిత, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజల అభివృద్ధే లక్ష్యం

- రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలతో ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. గురువారం వీరబల్లి మండలంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటిని సందర్శిస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్-6 హామీల పురోగతిని ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలు, కీలక ప్రాజెక్టుల వివరాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడమే కాకుండా ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు కూడా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజుకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో వీరబల్లి మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, సురేంద్ర, టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మయ్య, సర్పంచ్ నాగార్జునాచారి, టీడీపీ నాయకులు రాజనాయుడు, నాగభూషయ్యనాయుడు, రాంమోహన్‌రెడ్డి, నందకుమార్‌నాయుడు, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న జగన్‌మోహన్‌రాజు

వైభవంగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో గురువారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులకు విశేషంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం కమనీయంగా జరిగింది. వేడుకల్లో పాల్గొన్న దంపతులు, భక్తులు టీటీడీ వస్త్రం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిపై విశేషాలంకరణలతో పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, వేదపండితులు కృష్ణప్రసాద్ భట్టార్, అర్చక బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

చిన్నపిల్లల తప్పిదంతోనే బుద్ధ విగ్రహం తల విరిగింది

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీలోని నల్లగుట్ట (బుద్ధవిహార్)లో ఏర్పాటు చేసి ఉన్న బుద్ధుడి విగ్రహం తల చిన్నపిల్లల తప్పిదంతోనే విరిగిందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. గురువారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అంకిశెట్టిపల్లె గ్రామ రెవెన్యూ పరిధిలో గల నల్లగుట్టపైన గౌతమ బుద్ధ విగ్రహాన్ని పగలగొట్టిన విషయంపై అంకిశెట్టిపల్లె గ్రామ రెవెన్యూ అధికారి నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 3వ తేదీ మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే మదనపల్లె డీఎస్పీ ఎస్.మహేంద్ర పర్యవేక్షణలో మదనపల్లె తాలూకా, మదనపల్లె వన్‌టౌన్, మదనపల్లె టూటౌన్ అధికారులు, సిబ్బంది రెండు గ్రూపులు ఏర్పడి ముమ్మరంగా దర్యాప్తు కొనసాగించగా బుద్ధుడి విగ్రహం తల విరిగిపోయిన సంఘటనలో అసలైన నిజాలు వెలుగులోకి వచ్చాయన్నారు. మదనపల్లె పట్టణానికి చెందిన ఇద్దరు పిల్లలు కలిసి యోగాంధ్ర కార్యక్రమం జరిగిన రోజు చేపలు పట్టడానికి చిప్పిలికుంట వద్దకు వెళ్లారన్నారు. నల్లగుట్టపైన గల గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని గమనించి విగ్రహం ఉన్న దిమ్మెపైకి ఎక్కి విగ్రహం కింద ఉన్న రంధ్రంలో డబ్బులు ఉంటాయనే ఆలోచనతో బుద్ధుడి విగ్రహాన్ని పక్కకు జరిపే క్రమంలో ఆ విగ్రహం దిమ్మెపై నుంచి కింద ఉన్న పెద్దరాయిపైన పడి విగ్రహం తల నుంచి వేరుపడిందని తెలిపారు. వారిద్దరూ ఈ విషయాన్ని వారి తల్లిదండ్రులకు చెప్పగా వారు ఈ విషయం బయటికి తెలిస్తే పిల్లల భవిష్యత్తుకు ఇబ్బంది వస్తుందేమో అని భయపడి కొద్ది రోజులు మౌనంగా ఉన్నారన్నారు. పత్రికల్లో బుద్ధుడి విగ్రహం గురించి కథనాలు రావడంతో భయపడి బుధవారం పోలీసులను కలిసి పిల్లలు తెలిసో తెలియక బుద్ధుడి విగ్రహ విషయంలో తప్పు చేశారని పిల్లలను క్షమించాలని అడిగారన్నారు. ఈ సందర్భంగా బుద్ధుడి విగ్రహం విషయంలో పిల్లలు తెలిసో తెలియకో తప్పు చేశారని, వారి భవిష్యత్తు దృష్ట్యా మా పిల్లలను క్షమించాలని మీడియా సమావేశంలో తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, మదనపల్లి డీఎస్పీ ఎస్.మహేంద్ర, మదనపల్లె తాలూకా సీఐ కళావెంకట్రమణ, ఎస్ఐలు ఎస్.అన్వర్ బాషా, ఎస్. రహీముల్లాలు పాల్గొన్నారు.

ఆరా.. ముంచెరా..!

- అత్యాశకు పోయి రోడ్డున పడ్డారు..
- వీడియోల పేరుతో కుచ్చుటోపి..
- జిల్లాలో 10 వేల మందికి పైగా బాధితులు


మదనపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద ఆరా బాధితులు

మదనపల్లె అర్బన్/కురబలకోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తక్కువ డబ్బు పెట్టుబడితో అధిక లాభాలను ఆర్జించవచ్చనే అత్యాశకు పోయి మోసపోతున్న సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల కురబలకోట మండలం అంగళ్లులో ఎలైట్ క్రీప్స్ డేటా సొల్యూషన్స్ సంస్థ పేరుతో భారీ స్థాయిలో దోపిడీకి పాల్పడ్డ కొత్త రకం మోసం వెలుగులోకి వచ్చింది. ఈ సంస్థ ద్వారా అంకెల రాత పేరుతో అమాయక ప్రజలను బురిడీ కొట్టించి భారీ స్థాయిలో డబ్బులు కాజేశారు. అయితే ఈ సంస్థ చేసిన మోసాలను మరువకముందే ఆరా యాప్ పేరుతో కొత్త రకం మోసం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటకతో పాటు వివిధ రాష్ట్రాల్లో విస్తరించి కోట్లాది రూపాయలను కాజేశారు.

రూ.2 వేల నుంచి

రూ.38 లక్షల మెంబర్‌షిప్..

ఆరా యాప్‌లో మెంబర్ చేసుకునే వారు వి1లో చేరితే రూ.2 వేలు చెల్లిస్తే ఏడాదికి రూ.23,725, వి2లో చేరి రూ.5400 కడితే ఏడాదికి రూ.65,700, వి3లో చేరి రూ.20 వేలు చెల్లిస్తే ఏడాదికి రూ2,51,850, వి4లో చేరి రూ.65 వేలు చెల్లిస్తే ఏడాదికి రూ.8,43,150, వి5లో చేరి రూ.1.50 లక్షలు చెల్లిస్తే ఏడాదికి రూ20,98,750, వి6లో చేరి రూ.3.85 లక్షలు చెల్లిస్తే ఏడాదికి రూ.54,02,000, వి7లో చేరి రూ.9 లక్షలు చెల్లిస్తే ఏడాదికి రూ.1,36,87,500, వి8లో చేరి రూ.18.50 లక్షలు చెల్లిస్తే ఏడాదికి రూ.2,83,24,000, వి9లో చేరి రూ.38 లక్షలు చెల్లిస్తే ఏడాదికి రూ.5,76,70,000 వస్తుందని యాప్‌లో ప్రచారం చేశారు. దీంతో చాలామంది ఎగబడి మరి చేరారు. దీనికోసం వాళ్లు పొందిన మెంబర్ షిప్ ఆధారంగా ప్రతిరోజు 5 నుంచి 200 వీడియోలు చూడాల్సి ఉంటుంది. దీనికి కనిష్ఠంగా రూ.13 నుంచి గరిష్ఠంగా రూ.790 చెల్లిస్తారు. ఇందులో చేరిన వారు వారి కింద జాయిన్ చేసుకుంటే వారికి 30 శాతం రెఫరల్ బోనస్ ఇస్తారు. వీటితో పాటు ఒక మెంబర్ కింద 10 మంది జాయిన్ అయితే నెలకు జీతం రూ.5 వేలు, 100 మంది జాయిన్ అయితే 30 వేలు, 300 మంది చేరితే రూ.లక్ష వేతనం ఇస్తామని నమ్మించారు. తాము సంపాదించిన విషయం చుట్టుపక్కల వారికి తెలియజేయడంతో ఆశపడి విపరీతంగా చేరారు. జిల్లాలో దాదాపుగా 10 వేల మంది ఇందులో చేరినట్లు తెలుస్తోంది. రెండు వారాలుగా డబ్బు విత్‌డ్రా కాకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు మదనపల్లె వన్‌టౌన్, తాలుకా పోలీసుస్టేషన్లకు క్యూ కడుతున్నారు. ఆరా యాప్ ఏపీ హెడ్‌గా మదనపల్లె పట్టణం కురవంకకు చెందిన మోహన్‌బాబు అనే వ్యక్తి అన్నమయ్య, కడప, సత్యసాయి, నెల్లూరు జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలో అధికంగా ఈ యాప్‌లో సభ్యులను చేర్పించాడు. బుధవారం రాత్రి మోహన్‌బాబును సీఐ ఎరిషావలి అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. గురువారం కూడా చాలా వరకు ఆరా బాధితులు పోలీస్‌స్టేషన్లకు క్యూ కట్టారు.


ఆరా యాప్ ఏపీ కో-ఆర్డినేటర్ మోహన్‌బాబు

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి : డీఎస్పీ

అంగళ్లులో నెంబర్ల మోసం మరువక ముందే ఆరా యాప్ ఆన్‌లైన్ మోసానికి పాల్పడిందని, ఆరా బాధితులు ఉంటే వెంటనే వారి పరిధిలోని పోలీసుస్టేషన్‌లకు వెళ్లి ఫిర్యాదు చేయాలని డీఎస్పీ మహేంద్ర తెలిపారు. ఆరా మోసంపై దర్యాప్తు చేస్తున్నామని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

తొలకరి వచ్చిందంటే చాలు భూములను సాగుకు సిద్ధం చేసుకోవడం.. వేరుశనగ విత్తన కాయల కొనుగోలు.. వాటిని విత్తడానికి సిద్ధం చేసుకోవడం వంటి పనులతో గ్రామాలు సందడిగా కనిపించేవి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. వరుణుడు ముఖం చాటేయడంతో వేరుశనగ సాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోయింది. ఫలితంగా ఎక్కడ చూసినా బీడు భూములే దర్శనమిస్తున్నాయి. అరకొరగా సాగైన వేరుశనగ పైరు కూడా వర్షం కురవకపోవడంతో వాడుముఖం పట్టింది. ప్రతి ఏటా వేరుశనగ సాగు చేస్తున్న రైతులు నష్టాలే చవిచూస్తున్నారు. దీంతో అప్పులు చేసి పంట సాగు చేస్తున్న రైతులకు ప్రతి ఏటా నిరాశే మిగులుతోంది. పదిరోజులుగా అడపాదడపా మేఘాలు ఊరిస్తూ చిరుజల్లులు కురుస్తున్నాయే తప్ప ఓ మోస్తరు వర్షం కూడా పడలేదు.

కనుచూపు మేరా బీళ్లే..!


పర్తికోట సమీపంలో సాగుకు నోచుకోని భూములు

- ముఖం చాటేసిన వరుణుడు...
- ఖరీఫ్ సీజన్‌లో పొలాల్లో కనిపించని పైరు
- భారీగా పడిపోయిన సాగు విస్తీర్ణం
- వాడిపోయిన వేరుశెనగ

ములకలచెరువు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె, కురబలకోట, పెద్దమండ్యం మండలాల్లో ప్రతిఏటా ఖరీఫ్‌లో వర్షాధారంగా వేరుశనగ సాగు చేస్తారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో అప్పుడప్పుడూ వర్షాలు కురిసినా... తీరా విత్తనాలు విత్తే సమయంలో వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో సాగుకు సిద్ధమైన రైతన్నలకు నిరాశే మిగిలింది 25 రోజుల క్రితం అరకొరగా కురిసిన వర్షాలకు కొందరు రైతులు వేసిన విత్తనం మొలిచినా, ఆ తర్వాత వర్షం కురవకపోవడంతో మొక్కలు వాడుముఖం పట్టాయి. వారం రోజుల్లోగా వర్షం కురవకపోతే ఆ మొక్కలు కూడా ఎండిపోయే అవకాశం ఉంది.


వర్షం లేక గిడసబారిన వేరుశెనగ పైరు

అంచనాలు ఉల్టా ..

తంబళ్లపల్లె నియోజవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 13,850 హెక్టార్లలో వేరుశనగ సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. అయితే నియోజకవర్గంలో కేవలం 1,475 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ సాగైంది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సాగు విస్తీర్ణం భారీగా పడిపోవడానికి కారణమని రైతులు అంటున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని మండలాల్లో సాగు విస్తీర్ణం వివరాలిలా ఉన్నాయి.

ప్రత్యామ్నాయ పంటలే దిక్కు..

సహజంగా జూన్ 15 నుంచి జూలై మొదటి వారం వరకు వేరుశనగ విత్తనం వేసేందుకు అనువైన కాలం. ఈ సమయంలో వర్షాలు కురవకపోవడంతో వేరుశనగ సాగుకు నోచుకోలేదు. దీంతో దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు ప్రత్యామ్నాయంగా కందులు, మొక్కజొన్న, ఉలవ సాగు చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

సాగు విస్తీర్ణం తగ్గడం ఇదే ప్రథమం

వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గిపోవడం 20 ఏళ్లలో ఇదే ప్రథమమని రైతులు చెబుతున్నారు. ప్రతిసారీ విత్తనాలు విత్తే సమయంలో వర్షం పడేదని అంటున్నారు. అప్పట్లో తీరా పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు ఎక్కువగా కురవడమో, సాగు సమయంలో వర్షాలు కురవకపోవడం వల్లో నష్టపోయేవాళ్లమంటున్నారు. ఈసారి మాత్రం గతానికి విరుద్ధంగా విత్తనం సమయంలోనే వర్షం కురవకపోవడంతోనే సాగు చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలం	టార్గెట్	సాగయింది
ములకలచెరువు	2924 హెక్టార్లు	510 హెక్టార్లు
కురబలకోట	1800 హెక్టార్లు	400 హెక్టార్లు
తంబళ్లపలె	3200 హెక్టార్లు	350 హెక్టార్లు
పెద్దతిప్పసముద్రం	2300 హెక్టార్లు	101 హెక్టార్లు
బి.కొత్తకోట	2106 హెక్టార్లు	64 హెక్టార్లు
పెద్దమండ్యం	1520 హెక్టార్లు	50 హెక్టార్లు

మేఘాల వైపు చూస్తున్నా...



25 రోజుల ముందు కురిసిన వర్షానికి రూ.1.50 లక్షలు ఖర్చు చేసి పది ఎకరాల్లో వేరుశనగ విత్తనం వేశాను. అప్పటి నుంచి వర్షం కురవకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. వారం రోజుల్లో వర్షం కురవకపోతే పైరు పూర్తిగా ఎండిపోతుంది. దీంతో వర్షం కోసం మేఘాల వైపు చూస్తు కుర్చున్నా. వరుణ దేవుడు కరుణ చూపకపోతే తీవ్ర నష్టమే.

- రమేశ్, కొట్టంవారిపల్లె

సాగు చేయలేకపోయా...



ప్రతి ఏడాది ఖరీఫ్‌లో ఐదు ఎకరాల వరకు వేరుశనగ సాగు చేసేవాడిని. ఈ సారివర్షం లేక సాగు చేయలేదు. గతంలో ఖరీఫ్‌లో ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా వేరుశనగ పంట కనిపించేది. ప్రస్తుతం బీడు భూములు కనిపిస్తున్నాయి. దేవళచెరువు పంచాయతీలో గతంలో 500 ఎకరాల వరకు వేరుశనగ సాగయ్యేది. ఇప్పుడు 20 ఎకరాలు కూడా సాగు కాలేదు.

- నరసింహారెడ్డి, కన్నెమడుగువారిపల్లె

ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహిస్తాం



వర్షాలు కురవక రైతులు వేరుశనగ సాగు చేయలేకపోయారు. ప్రస్తుతం విత్తనాలు విత్తే సమయం కూడా ముగియడంతో, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా చూస్తాం. ప్రస్తుతం కంది, మొక్కజొన్న, ఉలవ సాగు చేసుకోవచ్చు. రైతులు ఆందోళన చెందకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే మంచిది.

-స్రవంతి, వ్యవసాయశాఖాధికారి

ఆక్రమిత స్థలం పంచాయతీకి స్వాధీనం



పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకున్న స్థలం, పునాదులు

మదనపల్లె టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): సీటీఎం-1 గ్రామ పంచాయతీకి చెందిన రూ.30 లక్షల విలువైన స్థలాన్ని స్వాధీనం చేస్తూ రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత నెల ఒకటో తేదీన ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన 'వివాదాస్పద స్థలంలో బేస్‌మెంట్ నిర్మాణం' కథనంపై స్పందించిన రెవెన్యూ అధికారులు పంచాయతీ కార్యాలయం, జాతీయ రహదారి, రైల్వేలైను పక్కనే వున్న ఈ స్థలంపై ఆరా తీశారు. రెవెన్యూ ఏ-రిజిస్టర్‌లో సర్వే నెంబర్ 978/బి డాటెడ్ ల్యాండ్‌గా నమోదైందన్నారు. ఇందులోని 0.32 ఎకరాల విస్తీర్ణం గల భూమి గ్రామ పంచాయతీకి బదలాయించినట్లు తెలిపారు. ఈ స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులు పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

విజిలెన్స్, వాణిజ్య పన్నుల శాఖ మెరుపు దాడులు

- దుకాణం సీజ్


హర్షవర్ధన్ ఆటో మొబైల్స్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

రైల్వేకోడూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం విజిలెన్స్, వాణిజ్య పన్నుల శాఖ అధికారుల మెరుపు దాడులు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఎస్పీ శివన్న, డీసీటీవో గీతా వాణి మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరు పట్టణంలోని రాజ్ కన్వెన్షన్ పక్కనే ఉన్న హర్షవర్ధన్‌రెడ్డి ఆటో ట్రేడర్స్‌కు 2017లో జీఎస్టీ రద్దు అయినా.. అదే పేరుతో సంస్థను నిర్వహిస్తూ పన్ను ఎగవేశారని తెలిపారు. 2022 నుంచి హర్షవర్ధన్ ఆటో మొబైల్స్ అనే పేరుతో ఎలాంటి అనుమతులు, రికార్డులు లేకుండానే సంస్థను కొనసాగించడంతో ప్రభుత్వ ఆదాయానికి లక్షలాది రూపాయల మేరకు గండిపడిందన్నారు. దీంతో దుకాణాన్ని వీఆర్వో పీఆర్ ఈశ్వరయ్య సమక్షంలో స్థానిక పోలీసుల సహకారంతో పంచనామా చేసి సీజ్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ నాయకుల నారాయణ, డీసీటీవోలు ఖాజాహుస్సేన్, బాబుమోసెస్, మధుసూదన్‌రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ ఏసీటీవోలు కవిత, నాగేంద్ర, కరీం తదితరులు పాల్గొన్నారు.

లారీ కిందపడి ఉత్తరప్రదేశ్ వాసి మృతి


మోర్‌సింగ్ మృతదేహం

మదనపల్లె అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక టమోటా మార్కెట్ యార్డులో లారీ కిందపడి యూపీ వాసి మృతి చెందాడు మదనపల్లె టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఐదేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 80 మంది బతుకుదెరువు నిమిత్తం మదనపల్లెకు తరలివచ్చి నీరుగట్టువారిపల్లె టమోటా మార్కెట్‌లో దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. వారిలో ఒకడైన కాశిగంజ్ జిల్లా, నంగులా తానాకు చెందిన మోర్‌సింగ్ (50) గురువారం రాత్రి టమోటా మార్కెట్‌లో పని చేస్తుండగా రివర్స్ తీసుకుంటున్న లారీ వెనక చక్రాల కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం వివరాలను సేకరించి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామచంద్ర తెలిపారు. మార్కెట్ యార్డులోని అతని సహచరులు, తమ ఊరివాళ్లు మృతదేహాన్ని చూసి కనీరుమునీరయ్యారు.

'టీచర్లను బోధనకే పరిమితం చేయాలి'

- ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి

పీలేరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి అరవ వేణుగోపాల్ రెడ్డి కోరారు. పట్టణంలో ఎస్టీయూ డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువుకు సంబంధం లేని యాప్‌లతో టీచర్ల సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఒక చోటి నుంచి మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా జాప్యం చేయడం సబబు కాదన్నారు. ఉపాధ్యాయులకు అందవలసిన ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో ఇవ్వకపోవడం తగదన్నారు. వాస్తవాలను గుర్తించి న్యాయమైన సమస్యలు సత్వరం పరిష్కరించాలని కోరారు. జిల్లాలో ఎస్టీయూను బలోపేతం చేయడం కోసం సత్వరం మండలాల వారీగా సభ్యత్వ నమోదు ప్రారంభించాలని నిర్ణయించారు. డివిజన్ లో మండల కమిటీలతో సమావేశాలు నిర్వహించి నిర్ణీత గడువులోపు మెంబర్‌షిప్ కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో యూనియన్ నేతలు మహేశ్వర్ రెడ్డి, లోకనాథరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, డాక్టర్ జనార్ధన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బాల వెంకట్రమణ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలి

- అధికారులకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ సూచన


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), జూలై24(ఆంధ్ర జ్యోతి): ప్రజలందరూ సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బందిసేవలందించాలని, ఇందుకు సంబంధించిన మార్గ దర్శకాలను, బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేదరికం లేని సమాజం పీ4 కార్యక్రమం, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచిఅభిప్రాయాల సేకరణ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ చామకూరి శ్రీధర్, సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పీ4 కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, మార్గదర్శి బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేసి ఆగస్టు 15 కల్లా పూర్తయ్యేలా చూడాలన్నారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి లేకుండా చూడాలని, ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించిన వాటిపై సమీక్షిస్తూ ఇసుక లభ్యత, విద్యుత్ అన్నివేళలా అందించడం, విద్యుత్‌లో ఓల్టేజ్ సమస్యలు లేకపోవడం వంటి అంశాల్లో ప్రజలందరూ సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనల మేరకు సంబంధిత శాఖల వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌పై హత్యాయత్నం కేసు

రాయచోటిటౌన్, జూలై24(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డిపై అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు... రాయచోటి పట్టణ పరిధిలోని మిట్టవాండ్లపల్లె వద్ద గల సర్వే నెంబర్ 553లో రిటైర్డ్ డీఈ మండెం ఆదినారాయణరెడ్డికి 50 సెంట్లు పట్టా భూమి ఉంది. ఆ స్థలంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి తన కల్యాణ మండపానికి సిమెంటు రోడ్డు వేశాడు. దీనిపై వారి మధ్య వివాదం నడుస్తోంది. గురువారం ఆదినారాయణరెడ్డి తన భూమిలో సిమెంటు రోడ్డు వేయడాన్ని అడ్డుకున్నాడు. దీంతో దశరథరామిరెడ్డి మారణాయుధాలు కలిగిన సుమారు 20 మందితో కలసి ఆదినారాయణరెడ్డి కుటుంబ సభ్యులను చంపే ప్రయత్నం చేశాడని రాయచోటి పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో దశరథరామిరెడ్డితో పాటు అతని అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటచలపతి తెలిపారు.

ఆకతాయికి దేహశుద్ధి

గుర్రంకొండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): కళాశాలల వద్ద అమ్మాయిలను వేధిస్తున్న ఆకతాయికి ఓ బాలిక తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. పట్టణంలోని కాలేజీలు, పాఠశాలలు వద్ద విద్యార్థినులకు ఆకతాయిల వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో పాఠశాలలు, కాలేజీలకు వెళ్లాలంటేనే బాలికలు హడలిపోతున్నారు. మధ్యాహ్నం, సాయంకాలం ఆకతాయిలు ద్విచక్ర వాహనాల్లో తిరుగుతూ బాలికలను ఇబ్బంది పెడుతున్నారు. విద్యార్థినులకు బలవంతంగా ఫోన్ నెంబర్లు ఇచ్చి బెదిరిస్తున్నారు. కొందరు విద్యార్థినులు ఆకతాయిల వేధింపులు తల్లిదండ్రులకు చెప్పలేక ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తనను ప్రేమించాలంటూ ఓ యువకుడు గురువారం మధ్యాహ్నం ఓ విద్యార్థినిని వేధించాడు. ఈ విషయాన్ని ఆమె ఫోన్ ద్వారా తన తండ్రికి తెలియజేసింది. దీంతో కాలేజీ వద్దకు వచ్చిన విద్యార్థిని తండ్రి ఆ యువకుడిని చితకబాదాడు. విషయాన్ని కాలేజీ అధ్యాపకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆకతాయి యువకుడిని పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. పట్టణంలో ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

నిమ్మనపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేస్తుండగా పాముకాటు వేయడంతో ఓ మహిళ పరిస్థితి విషమంగా మారింది. గురువారం జరిగిన ఈ సంఘటనపై బాధిత కుటుంబీకుల కథనం మేరకు వెంగంవారిపల్లి పంచాయతీ బాలినాయునిపల్లి గొల్లపల్లివాసి పాలేటి భార్య మంగమ్మ ఎర్రచెరువు వద్ద వ్యవసాయ పనులు చేస్తుండగా కాలికి పాము కాటు వేసింది. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకుంది. పరిస్థితి గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పీజీఆర్ఎస్ దరఖాస్తులపై సత్వరం స్పందించండి


- సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్



తహసీల్దార్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

బి.కొత్తకోట, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌యస్) దరఖాస్తులపై సత్వరం స్పందించి పూర్తి ఆధారాలతో సరైన నివేదికను ఇవ్వాలని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన బి.కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే, హౌసింగ్, పీజీఆర్‌యస్ అర్జీలతో పాటు పలు రెవెన్యూ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి వీఆర్వోను విడివిడిగా పిలిచి ఆయా గ్రామపంచాయతీలోని తాజా పరిస్థితిపై ఆరా తీశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్దేశిత అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలతో సిద్ధంగా ఉండాలని, వివిధ సమస్యలపై ప్రజలు పెట్టుకునే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబాజాన్, డీటీ బాలాజీ, ఆర్ఐ వీరాంజనేయులు పాల్గొన్నారు.

ధర్మవరం-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ వారం రోజులు రద్దు



కలికిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నుంచి విజయవాడ, తిరుపతి, పీలేరు, కలికిరి మీదుగా ధర్మవరం వరకూ నడిచే ఎక్స్‌ప్రెస్ సర్వీసులను వారం రోజులపాటు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. 17247 నెంబరుతో నర్సాపూర్ నుంచి ధర్మవరం వరకు నడిచే సర్వీసు ఆగస్టు 11 నుంచి 18 వరకు రద్దు కానుంది. 17248 నెంబరుతో ధర్మవరం నుంచి నర్సాపూర్‌కు నడిచే సర్వీసును ఆగస్టు 12 నుంచి 19వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. ఈ సర్వీసుల కోసం ఈ తేదీల్లో ఇది వరకే టికెట్లు రిజర్వు చేసుకున్న వారికి ప్రత్యామ్నాయ మార్గాల వెసులుబాటు కోసం సర్వీసులు రద్దు చేస్తున్నట్లు సందేశాలు కూడా పంపింది. విజయవాడ-గూడూరు స్టేషన్ల మధ్య పెదవడ్లపూడి, దుగ్గిరాల, తెనాలి జంక్షన్, సుందూరు స్టేషన్ల మధ్య డబ్లింగ్ నుంచి ట్రిబ్లింగ్ (మూడు లేన్‌లు), విద్యుదీకరణ, ఇతర పనులు జరుగుతున్న కారణంగా ఈ సర్వీసులను రద్దు చేస్తున్నారు. ఈ మార్గంలో మొత్తం 49 ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్, ప్యాసింజర్ సర్వీసులు కూడా వివిధ తేదీల్లో రద్దవుతున్నాయి.

సైబర్ నేరస్థుడి అరెస్టు

- కడపలో అదుపులోకి తీసుకున్న ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు

ఖమ్మంక్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ టీచర్‌ను బెదిరించి సుమారు రూ. 26 లక్షలు వసూలు చేసి మోసం చేసిన కేసులో ఒకరిని ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు కడప జిల్లాలో అరెస్టు చేసినట్లు ఖమ్మం సీపీ సునీల్ దత్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలానికి చెందిన రిటైర్డ్ టీచర్‌కు నిందితుడు ఫోన్ చేశాడు. హ్యూమన్ ట్రాఫికింగ్, మనీలాండరింగ్‌కి పాల్పడ్డావని బెదిరించారు. తాము బెంగుళూరు పోలీసులమని, డిజిటల్ అరెస్టు చేస్తామని హెచ్చరించారు. దీంతో భయపడిన సదరు ఉపాధ్యాయుడు ఏప్రిల్ 2025లో పలు దఫాలు గా సుమారు రూ.26లక్షలు వారి ఖాతాకు జమ చేశాడు. ఈక్రమంలో రూ. 20లక్షలు అకౌంట్‌కి వెళ్లిన దామ విజయ్‌కుమార్ అనే యువకుడిని అన్నమయ్య జిల్లా, లక్కిరెడ్డిపల్లి గ్రామంలో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారని తెలిపారు.

తాళి కట్టు శుభవేళ..!



- నెల రోజులపాటు ఊపిరాడని ముహూర్తాలు
- వివిధ శుభ కార్యాలకు సమాయత్తం
- కల్యాణ మండపాల బుకింగ్ ఫుల్
- నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- నెల రోజుల విరామంతో వరుస ముహూర్తాలు

కలికిరి/బద్వేలు టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మంచి ముహూర్తమనే పేరు ఎత్తకుండానే నెల రోజులపాటు బేజారెత్తించిన ఆషాఢ మాసం ముగిసింది. గురు మూఢం వైదొలగి శ్రావ్యమైన శ్రావణ మాసానికి తలుపులు బార్లా తెరచింది.. అడుగడుగునా శుభ ముహూర్తాలతో ఈ నెల రోజులపాటు ఎడతెరిపి లేకుండా పెళ్లి బాజాలు మోగేందుకు సిద్ధమయ్యాయి. జూలై చివరి వారం నుంచి ఆగస్టు మూడో వారం వరకూ పెళ్ళిళ్లు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు వంటి శుభ కార్యాలకు తగిన 15 ముహూర్తాలున్నాయి. ఆషాఢ మాసానికి ముందే నిశ్చితార్థాలు పూర్తయిన వారు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఇప్పటికైతే కల్యాణ మండపాలన్నీ పూర్తిగా బుక్ అయిపోయాయి. ఆలస్యంగా ముహూర్తాలు పెట్టుకున్న వారు కనీసం చిన్నపాటి ఫంక్షన్ హాలు కూడా దొరక్క బెంబేలెత్తిపోతున్నారు. వరుణ దేవుడు మన్నిస్తే ఇంటిపట్టునే ఆరుబయట పందిళ్ళేసి మమ అనిపించేందుకు కూడా సిద్ధపడుతున్నారు. శుభ లేఖలు పంపిణీ, ఆభరణాల కొనుగోలు, వంట సామాగ్రి సమీకరణ, బాజా భజంత్రీలు, అలంకరణలు వంటివాటిపై దృష్టి పెట్టారు. మరో వైపు కేటరింగ్ లేదా వంట మాస్టర్ల ముందస్తు నిర్ణయాలు కూడా పూర్తయ్యాయి. ఇప్పుడిప్పుడే ఆడంబరాల కోసం బారాత్‌లాంటి వ్యవహారాలపై రిహార్సల్స్ మొదలు పెట్టేవారూ వున్నారు. శ్రావణ మాసంలో జూలై 26, 30, 31 తేదీల్లో ముహూర్తాలు ప్రారంభమవుతుండగా ఆగస్టులో దాదాపు 12 రోజులు శుభ ముహూర్తాలున్నాయి. అనంతరం 18 నుంచి సెప్టెంబరు 20 వరకూ భాద్రపద మాసంలో పూర్తిగా ముహూర్తాలు ఉండవు. ఆపైన సెప్టెంబరు 24 నుంచి నాలుగు రోజులు, అక్టోబరు నెలాఖరు వరకూ 13 రోజులు, ఆ తరువాత నవంబరులో మరో 13 రోజులు ఆశ్వయుజ, కార్తీక మాసాల్లో ముహూర్తాల సందడికి కొదవుండదు.

శ్రావణ మాసంలో ఆధ్యాత్మిక సందడి

ఒక వైపు శుభ ముహూర్తాలతో తెలుగు లోగిళ్ళు శ్రావణ మాసంలో కళకళలాడనుండగా మరో వైపు ఈ మాసమంతా ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది. ప్రధానంగా మహిళలకు.. అందునా నూతన వధువులకు మంగళగౌరీ వ్రతాలతో తీరికుండదు. రుద్రాభిషేకంలాంటి శివారాధనలకు ఈ మాసం విశిష్టమైనదిగా చెపుతారు. జీవ నదుల్లో శ్రావణ మాస స్నానాలు కూడా పవిత్రంగా భావిస్తారు. ఈ మాసంలో చంద్రుడు, శుక్రుడు శక్తివంతంగా ఉంటారని కూడా శాస్త్రాలు చెపుతాయి. ఇక శ్రావణ పౌర్ణమిని రాఖీ పౌర్ణమిగా కూడా భావిస్తారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలపై చెప్పాల్సిన పనిలేదు. మొత్తం మీద శుభ ముహూర్తాలు ఒక వైపు ఆధ్యాత్మిక సందడి మరో వైపు.. ఈ నెల రోజులూ హడావుడిగా ఉండనున్నాయి.

ఆగస్టులో 10 రోజుల సెలవులు

శ్రావణ మాసంలో ముహూర్తాల జోరుకు తగ్గట్లు ఆగస్టు నెలలో వరుస సెలవులు కూడా కలిసొస్తున్నాయి. ఆగస్టు 3 ఆదివారం, 8న వరలక్ష్మి వ్రతం, 9, 10 రెండవ శనివారం, ఆదివారాలు, 15న స్వాతంత్ర్య దినోత్సవంతోపాటు వరుసగా మూడు రోజులు అంటే 16 కృష్ణాష్టమి, 17న ఆదివారంతో వరుస సెలవులున్నాయి. ఇక ఆగస్టు 24 ఆదివారం, 27న వినాయక చవితి, మళ్లీ 31 ఆదివారంతో నెలంతా వెసులుబాటు కలుగుతోంది. ఈ నెలలో ఐదు ఆదివారాలు రావడం, మామూలుగా సెప్టెంబరులో వచ్చే వినాయక చవితి కూడా ఆగస్టులోనే రావడం బాగా కలిసొస్తోంది.

ప్రమాణ స్వీకారాలకు ఇదే సమయం

ఇక రాజకీయాల్లో కూడా ఒక రకమైన సందడి ఈ నెలలో కనపడనుంది. ఇటీవలే ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సహకార సంఘాలకు నామినేటెడ్ కమిటీలను నియమించింది. ఇన్నాళ్ళు మంచి ముహూర్తాలు లేక వేచి చూస్తున్న ఆ కమిటీల నాయకులు ఈ నెలలోనే ప్రమాణా స్వీకారాలకు కూడా ముహూర్తాలు పెట్టుకున్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ఎప్పుడో..!

- ఇంటర్ ఫలితాలు విడుదలై మూడు నెలలైనా..
- నోటిఫికేషన్ విడుదల చేయని విద్యాశాఖ
- ఎదురు చూస్తున్న విద్యార్థులు, యాజమాన్యాలు



కడప ఆర్ట్స్ కళాశాల (ఫైల్)

కడప ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు వెల్లడించి మూడు నెలలుపైనే గడుస్తున్నప్పటికీ డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ మొదలు కాకపోవడం గందరగోళానికి దారితీస్తోంది. ప్రవేశాలు ఎప్పుడు కల్పిస్తారంటూ ఇటు విద్యార్థులు, అటు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికే ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ అడ్మిషన్లతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసింది. వివరాల్లోకి వెళితే...

ఉమ్మడి కడప జిల్లాలో 71 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ప్రైవేటు 52, ఎయిడెడ్ 5, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు 14 ఉన్నాయి. వీటిల్లో అడ్మిషన్ల కోసం లక్షల మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. అడ్మిషన్లు తీసుకోవాలంటే కళాశాలలు గుర్తింపు కోసం దరఖాస్తులు చేసుకోవాలి. అడ్మిషన్ల ప్రక్రియ గందరగోళంలో ఉండడంతో ఈ ఏడాది ఇప్పటి వరకు ఎవరు దరఖాస్తు చేయలేదు. ప్రభుత్వం నుంచి కమిటీ వచ్చి కళాశాలలో మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా పరిశీలించి గుర్తింపు పునరుద్ధరిస్తారు. ఇప్పటి వరకు ఇలాంటి ప్రక్రియ మొదలు కాలేదు.

గందరగోళానికి ప్రధాన కారణం

డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం కొనసాగించాలా... డబుల్ మేజర్ విధానం ప్రవేశపెట్టాలా.. అనే గందరగోళం నెలకొనడమే అడ్మిషన్ల జాప్యానికి కారణం. ఇప్పటి వరకు సింగిల్ మేజర్ విధానం నడుస్తోంది. ఈ ఏడాది నుంచి డబుల్ మేజర్ విధానం ప్రవేశపెడతామని, ప్రతి కళాశాల ఇందుకు అప్‌గ్రేడ్ చేయించుకోవాలని సూచించారు. ఆ మేరకు యాజమాన్యాలు నగదు చెల్లించి అనుమతి తీసుకున్నారు. విద్యార్థులకు డబుల్ మేజర్‌పై అవగాహన కల్పించారు. చాలా మంది తల్లిదండ్రులు దీనివైపు మొగ్గుచూపించారు. కానీ ప్రభుత్వం చివరకు సింగిల్ మేజర్ వైపు మొగ్గు చూపుతూ నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఇంతకుముందు ఆఫ్‌లైన్‌లోనే డిగ్రీ ప్రవేశాలకు అడ్మిషన్లు జరిగేవి. వైసీపీ వచ్చాక ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టింది. ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో ప్రవేశాలు కల్పించే అవకాశం ఉందని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. దీనిపై కూడా అయోమయం నెలకొంది.

విడుదల కాని బకాయిలు

ప్రభుత్వ కళాశాలలకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికీ విడుదల కాలేదు. దీంతో కళాశాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. బకాయిలను విడతల వారీగా విడుదల చేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటి వరకు విడుదల చేయలేదు. 2023-24కు మూడు క్వార్టర్లు, 2024-25కు మూడు క్వార్టర్లకు బకాయిలు విడుదల చేయాలి. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు.

సింగిల్, డబుల్ మేజర్ విధానం అంటే...

డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం అంటే విద్యార్థి ఒకే ఒక్క ప్రధాన సబ్జెక్టును మేజర్ తీసుకొని మిగిలిన సబ్జెక్టులను మైనర్‌గా గానీ, సపోర్టివ్‌గా గానీ చదవాలి. ఉదాహరణకు బీఎస్సీ (ఫిజిక్స్) అంటే... ఫిజిక్స్ ప్రధాన మేజర్ సబ్జెక్టు. మిగిలిన సబ్జెక్టులు కెమిస్ట్రీ, మేథ్స్ వంటివి సపోర్టివ్ ఉంటాయి. డబుల్ మేజర్ అంటే డిగ్రీలో రెండు ప్రధాన సబ్జెక్టులను మేజర్ తీసుకొని చదవాలి. ఉదాహరణకు బీఏ (హిస్టరీ, పొలిటికల్ సైన్స్) ఇక్కడ హిస్టరీ, పొలిటికల్ సైన్స్ రెండూ మేజర్ సబ్జెక్టులు. రెండింటిని సమాన ప్రాముఖ్యతతో చదివి, రెండింటిపైనా లోతుగా అవగాహన పెంచుకుంటారు.

ఇతర కోర్సుల వైపు విద్యార్థులు..

ప్రభుత్వ నిర్ణయం ఆలస్యం కారణంగా ఇప్పటికే డిగ్రీలో చేరాలనుకునే వేలాది విద్యార్థులు ఇంజనీరింగ్ ఇతర కోర్సుల వైపు వెళుతున్నారని యాజమాన్యాలు చెబుతున్నాయి. గత ఏడాది అడ్మిషన్లు బాగా పడిపోయాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో మరింత అడ్మిషన్లు తగ్గిపోయే ప్రమాదం ఉంది.

ప్రకృతి వ్యవసాయ సాగును విస్తరింపజేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్

కడపరూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగును మరింత విస్తరింప చేయాలని వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్ పేర్కొన్నారు. కడప నగరంలోని ఏడీఏ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై మూడురోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలను తెలిజేసి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలన్నారు. విచక్షణా రహితంగా వాడుతున్న రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రవిచంద్ర అరటి, నిమ్మ వంటి ఉద్యాన పంటలను ప్రకృతి వ్యవసాయం ద్వారా ఏ విధంగా పండించవచ్చునో తెలియజేశారు. కడప సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్వీ సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జీవామృతం, కషాయాలు ఏవిధంగా తయారు చేయాలో తెలుసుకుని రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ జిల్లా డీపీఎం ప్రవీణ్, కడప వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఏవోలు, రైతుసేవా ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

చీని, నిమ్మ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చీని, నిమ్మ పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి కోరారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులు చీని, నిమ్మ తోటలు సాగుచేస్తారన్నారు. అయితే ఈ ఏడాది ధరలు పూర్తిగా పడిపోవడంతో రైతుల తీవ్రంగా నష్టపో తున్నారన్నారు. వెంటనే మార్కెట్‌యార్డుల్లో నిల్వ ఉన్న వాటిని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ధ్రువకుమార్‌రెడ్డి, సయ్యద్ గౌస్‌పీర్, అశోక్‌రెడ్డి, సిరాజుద్దీన్, మాజీ కార్మిక సంఘ రాష్ట్ర చైర్మన్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విషద్రావణం తాగి వ్యక్తి ఆత్మహత్య



కమలాపురం రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాపాఘ్ని పాత బ్రిడ్జి కింద సయ్యద్ రసూల్ (52) విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు... కడపకు చెందిన సయ్యద్ గురువారం ఉదయం కమలాపురంలో ఉంటున్న తన కుమార్తె జైబీన్ ఇంటికి వచ్చాడు. కుమార్తె ఇంటి వద్ద లేకపోవడంతో తిరిగి కడపకు బయలుదేరాడు. 11 గంటల సమయంలో తన కుమార్తెకు ఫోను చేసి తనను దేవుడు రమ్మంటున్నాడని, పాపాఘ్ని నది సమపంలోని బ్రిడ్జి వద్ద విష ద్రావణం తాగానని, మీ అమ్మను జాగ్రత్తగా చూసుకోమని చెప్పి ఫోన్ కట్ చేశాడు. దీంతో అప్రమత్తమైన అతని కుమార్తె కుటుంబసభ్యులతో కలిసి సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు కమలాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విద్యాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూవివాదంలో వైసీపీ నాయకులు అరెస్టు

మైదుకూరు రూరల్, జులై 24 (ఆంధ్రజ్యోతి): భూవివాదమై మన్యం రాణి అనే మహిళపై కొడవలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో కొందరు వైసీపీ నాయకులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డమాయపల్లె గ్రామంలో నివశిస్తున్న మన్యం రాణి వారి దాయాదుల మధ్య భూ వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఆమె ఇంటిలో ఉండగా... మన్యం రమేష్‌రెడ్డి, మన్యం రజిత, మన్యం సిద్దారెడ్డి, మన్యం పెద్ద సిద్దారెడ్డి, మన్యం రామ్మోహన్‌రెడ్డి కొడవలితో దాడికి పాల్పడ్డారు. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో యువకుడి..

కడప క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అల్మాస్‌పేటకు చెందిన బాలికను కిడ్నాప్ చేసిన కేసుకు సంబంధించి యువకుడిని అరెస్టు చేసినట్లు కడప టూటౌన్ ఎస్ఐ హుసేన్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ప్రొద్దుటూరు పట్టణం ఆంధ్రకేసరి వీధికి చెందిన మునిశ్రావణ్‌కుమార్ ఇంటర్ వరకు చదివి ఖాళీగా ఉంటున్నాడు. ఈనెల 16న అల్మాస్‌పేటకు చెందిన బాలికను బలవంతంగా ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లాడు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసి గురువారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి మృతి

పోరుమామిళ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని శీనప్ప బావివీధికి చెందిన చెన్నంశెట్టి సుబ్బరాయుడు (34) కడుపు నొప్పి తాళలేక అధిక మోతాదులో మందులు వేసుకోవడంతో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. పోరుమామిళ్లలో చెన్నంశెట్టి సుబ్బరాయుడు మెడికల్ స్టోరు నిర్వహించేవాడు. ఈనెల 22న కడుపు నొప్పిరావడంతో మందులు తీసుకున్నాడు. నొప్పి ఎక్కువ కావడంతో మరికొన్ని మాత్రలు వేసుకోవడంతో అస్వస్థతకు గురయ్యాడు. అతన్ని కుటుంబ సభ్యులు పోరుమామిళ్లలోని ప్రైవేటు ఆసుపత్రికి... మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాల లారీ ఢీకొని గేదెలు మృతి



కొండాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఓబన్నపేట గ్రామం వద్ద గురు వారం సాయింత్రం పాలలారీ ఢీకొనడంతో రెండు గేదెలు మృతి చెందాయి. ఇదే గ్రామానికి చెందిన పెద్దగురప్ప అనే రైతు గేదెలను మేపుకొని రోడ్డు దాటుతుండగా తాడిపత్రి వైపు వెళుతున్న పాల లారీ గేదెలను ఢీకొంది. దీంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతిచెందగా, మరో గేదెకు గాయాలైనట్లు రైతు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, తనను ఆదుకోవాలని రైతు కోరారు.

31 మద్యం బాటిళ్లు స్వాధీనం

పోరుమామిళ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మద్యం బాటిళ్లు తీసుకెళుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. గురువారం సీతారామాపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పెద్దకప్పలనపల్లెకు చెందిన కప్పల శ్రీనివాసులు అక్రమంగా 31 మద్యం బాటిళ్లు తీసుకువెళుతుండగా స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

బద్వేలుటౌన్, జులై 24 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రోడ్డులోని స్థానిక పాల్‌టెక్నిక్ కళాశాల సమీపంలో గురువారం ఆటోను ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో శ్రీనివాసులు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనం ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురాయి అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయండి

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్సీ ఫిర్యాదు



సీఎం చంద్రబాబుకు అక్రమ మైనింగ్ అరికట్టాలంటూ వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె మండలాల్లో అక్రమ ముగ్గురాయి (బెరైటీస్) మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. గురువారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి ఎమ్మెల్సీ వినతిపత్రం సమర్పించారు. కడప జిల్లాలోని వేముల, వేంపల్లె మండలాల్లో అపారమైన ముగ్గురాయి ఉందన్నారు. బ్రిటీష్‌కాలం నాటి నుంచి ఇక్కడ కొందరికి మైనింగ్‌కు అనుమతులు ఉండేవన్నారు. అన్నిటికి కాలపరిమితి ముగిసిందన్నారు. వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ ముగ్గురాయిని కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా వెలికితీసి అక్రమంగా కోట్లు గడిస్తున్నారన్నారు. ఈ ముగ్గురాయి వెలికితీసే సమయంలో ఎలాంటి రక్షణ లేకుండానే వెళ్లి మైనింగ్ సాగిస్తున్నారన్నారు. దీంతో అనేక ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయని తెలిపారు. వేముల మండలం గొంది పల్లెలో 275 సర్వే నెంబర్‌లో 705.43 ఎకరాలలో కృష్ణప్ప బెరైటీస్ కంపెనీకి గతంలో అనుమతులు ఉండేవన్నారు. ప్రస్తుతం ఎలాంటి లీజు లేదు, రెన్యువల్ కూడా కాలేదన్నారు. ఈ కంపెనీ దాదాపు రూ.6కోట్లు ప్రభుత్వానికి బకాయిలు ఉందన్నారు. ఇదే సర్వేనెంబర్‌లో కొందరు అక్రమ మైనింగ్ సాగిస్తున్నారన్నారు. రోజు వంద టన్నుల ఖనిజాన్ని వెలికితీసి టన్ను రూ.30 వేల నుంచి రూ.35వేలతో విక్రయిస్తున్నారన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రవాణా కూడా సాగిస్తున్నారన్నారు. సంబంధించిన భూయజమాని అక్రమంగా చేస్తున్నారని అధికారులకు మొరపెట్టుకున్నా ఎవరూ స్పందించడం లేదన్నారు. అలాగే వేంపల్లె మండలం కత్తులూరు వద్ద అక్రమ మైనింగ్ జరుగుతోందన్నారు. ఈ అక్రమ మైనింగ్‌లో రామచంద్ర అనే వ్యక్తి మృతిచెందాడన్నారు. మృతుని కుటుంబానికి రూ.12లక్షలు ఇచ్చి కేసు రాజీ చేసుకున్నారన్నారు. పులివెందుల నియోజకవర్గంలో విచ్చలవిడిగా బెరైటీస్ తవ్వకాలు చేస్తున్నారన్నారు. వేముల మండలం వేముల గ్రామ పరిధిలో టిఫెన్ కంపెనీకి లీజు ఉండేదన్నారు. ఆ సంస్థ రూ.10కోట్ల విలువైన ఖనిజాన్ని వెలికితీసి అక్కడే నిల్వ ఉంచిందన్నారు. రాత్రికి రాత్రే దీనిని అక్రమంగా తరలించి అమ్ముకున్నారన్నారు. అక్రమ మైనింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని గతంలో మీరే హెచ్చరించారని ఆయన పేర్కొన్నారు.

వీరమల్లు సినిమా ఫ్యాన్స్‌షోలో ఘర్షణ

కడప క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నటించిన హరహర వీరమల్లు చలనచిత్రం ప్రీమియం షో 23న రాత్రి విడుదలైంది. ఈ సందర్భంగా రాత్రి నగరంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న థియేటరు వద్ద పవన్ అభిమానుల మధ్య తొలుత వాగ్వాదం చోటుచేసుకుంది. చివరికి ఘర్షణకు దారితీసింది. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయితే ఇరువర్గాల మధ్య మాటామాటా పెరగడంతో పోలీసులు చొరవ తీసుకుని వారిని అక్కడ నుండి పంపించారు. అయితే ఈ ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయంపై కడప వన్‌టౌన్ పోలీసులను వివరణ కోరగా, సినిమా ప్రీమియం రిలీజ్ సందర్భంగా తోపులాట జరిగిందని, అయితే ఎవరు కూడా తమకు లిఖితపూర్వక ఫిర్యాదు చేయకపోవడంతో కేసులు నమోదు చేయలేదని తెలిపారు.

పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో మరోసారి వైద్యపరీక్షలు

పులివెందుల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలో జరిగిన హత్యాయత్నం కేసులో ఉన్న ఐదుగురికి పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో మరోసారి (గురువారం) వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇనగలూరు గ్రామంలో కత్తులతో దాడి చేసిన ఘటనపై జూలై 21వ తేదీ 11మందిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులో ఐదుగురిని జమ్మలమడుగు సివిల్ జడ్జికోర్టులో బుధవారం హాజరు పరచగా ఎస్ఐ విచక్షణారహితంగా కొట్టారని జడ్జికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మరోసారి వైద్యపరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. దీంతో గురువారం ప్రశాంత్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గంగిరెడ్డిలకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

27న సీనియర్స్ అండర్-23 మహిళల క్రికెట్ ఎంపికలు

కడపస్పోర్ట్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 27వ తేదీ ఆదివారం ఉదయం సీనియర్స్‌తో పాటు అండర్-23 మహిళల క్రికెట్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. 2002 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు అర్హులని... ఆసక్తి గల క్రీడాకారులు క్రికెట్ ఎంపికలకు హాజరు కావాలని కోరారు. హాజరయ్యే క్రీడాకారిణీలు ఆధార్‌కార్డు కాపీ, బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్, కిట్ బ్యాగ్‌లు వెంట తీసుకురావాలన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా గాలిచంద్ర



బద్వేలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో కడప జిల్లా 22వ మహాసభలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శిగా గాలిచంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులుగా జి.రామయ్య, ఎల్.నాగసుబ్బారెడ్డి, బి.చంద్రశేఖర్, ఎస్.వెంకటశివ, పి.సుబ్బరాయుడు, సుబ్రహ్మణ్యం,వి.వీరశేఖర్, సుబ్బారెడ్డి, వేణుగోపాల్, విజయలక్ష్మి, శ్రీరాములు, కేసీ బాదుల్లా, సురేష్, పి.బాలు, మద్దిలేటి, శంకర్‌నాయక్, వెంకటరాముడుతో పాటు 79 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర మాట్లాడుతూ జిల్లాలో ఉక్కుఫ్యాక్టరీతో పాటు పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గాలేరు- నగరి, తెలుగుగంగ, రాజోలి 2వ దశ పనులుపూర్తి చేయాలని, సోమశిల, గండికోట, గాలేరు-నగరి ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులకు వెంటనే పరిహారం, పునరావాసం కల్పించాలని, కడప -బెంగుళూరు రైల్వే పనులు పూర్తి చేయాలని, మూతపడ్డ చెన్నూరు ఫ్యాక్టరీ, ప్రొద్దుటూరు పాలకేంద్రం తెరిపించాలని మహాసభలో తీర్మానించినట్లు ఆయన తెలిపారు.

'వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణానికి అనుమతి కోరలేదు'

బ్రహ్మంగారిమఠం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి మాస కల్యాణోత్సవం జరిపేందుకు ఆగస్టు 6న నిర్వహించేందుకు తన అనుమతి కోరలేదని పూర్వ మఠాధిపతి వీరభోగవసంత వేంకటేశ్వరస్వామి ధర్మపత్ని మారుతీ మహాలక్షుమ్మ ప్రకటనలో తెలిపారు. మఠం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ స్వామివారి కల్యాణం గురించి తమ అనుమతి కోరలేదన్నారు. కుటుంబ సభ్యులందరూ నిర్ణయం తీసుకున్నారనేది అబద్ధమని తెలిపారు. తనకు పంపిన లెటరులో మఠం అర్చకుల ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకున్నారని ఉందని.. కానీ మీడియాకు జూలై 9న ఇచ్చిన పత్రికా ప్రకటనలో అర్చకుల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులందరూ నిర్ణయం తీసుకున్నట్లు తేడాగా ఉందన్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవానికి తన అనుమతి అసలు కోరలేదని, తనకు లెటరు పంపేనాటికి హైకోర్టులో స్టేటస్‌కో ఇచ్చి ఉన్నట్లు మహాలక్షుమ్మ తెలిపారు.

2003 డీఎస్సీ వారికి పాతపింఛన్ అమలు చేయాలి



మంత్రులకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేసి 2003 డీఎస్సీ వారికి పాతపింఛన్ అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సీపీఎస్‌ఈఏ రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి వెంకట జనార్దన్‌రెడ్డి కోరారు. గురువారం సచివాలయంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు అమలు చేసిన విధంగా సీపీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేస్తూ.. అదే కేంద్ర ప్రభుత్వం 2004కు పూర్వం రాతపరీక్ష రాసిన వారికి పాత పింఛన్ అమలు చేస్తూ జారీ చేసిన మెమో 57ను ఇప్పటి వరకు రాష్ట్రప్రభుత్వం అమలు చేయకపోవడం శోచనీయమని తెలిపారు. కేవలం 11000 మంది మాత్రమే ఈ మెమో ద్వారా లబ్ధిపొందుతారని వారికి వెంటనే పాతపింఛన్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 2003 డీఎస్సీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి రవీంద్రారెడ్డి, జిల్లా కన్వీనర్లు కురుకుటి సుధాకర్, రిజ్వాన్ అలి, ప్రొద్దుటూరు నియోజకవర్గం బాధ్యులు అచ్చుకట్ల చాంద్‌బాష, అనంతపురం జిల్లా కన్వీనర్ గజ్జల ప్రభాకర్, ప్రకాశం జిల్లా కన్వీనర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PM SHRI SCHOOL JAWAHAR NAVODAYA VIDYALAYA
N.R.PALLI, RAJAMPET MANDAL,
DIST. ANNAMAYYA (KADAPA) A.P.

Ref.1-2/JNV/ANM/2025-26/ Date : 24.07.2025

PUBLIC NOTICE

It is hereby notified that the Walk-in-interview calling the candidates for engagement to the post of **JUNIOR SECRETARIAT ASSISTANT (LDC), LABORATORY ATTENDANT & COOK** published in Andhra Jyothy Daily Newspaper on 21.07.2025 is hereby **CANCELLED** due to Administrative reasons. However, Walk-in-Interview for the post of MATRON will be held as usual on 30.07.2025 (Wednesday) at 10.30 a.m. in the Vidyalaya as published.

(GANGADHARAN .K)
PRINCIPAL I/C

జవహర్ నవోదయ విద్యాలయ
ఎన్.ఆర్.పల్లి, రాజంపేట, అన్నమయ్య (కడప) జిల్లా, ఆంధ్రప్రదేశ్

ఫైల్ నెం. 1-2/JNV/ANM/2025-26/ తేది : 24.07.2025

పత్రికా ప్రకటన

21.07.2025న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ (LDC), లాబోరేటరీ అటెండెంట్ & COOK పోస్టులకు అభ్యర్థులను ఆహ్వానించే వాక్-ఇన్-ఇంటర్వ్యూను పరిపాలనా కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు ఇందుమూలంగా తెలియచేయడమైనది. అయితే, మేట్రాన్ పోస్టుకు సంబంధించిన వాక్-ఇన్-ఇంటర్వ్యూ యధావిధిగా 30.07.2025 (బుధవారం) ఉదయం 10.30 గంటలకు విద్యాలయంలో జరుగునని తెలియచేయడమైనది.

(గంగాధరన్. కె)
ప్రిన్సిపాల్ I/C

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

నిత్యం నీటి కష్టాలు.. గ్రామస్థులకు తిప్పలు

- డ్రిప్ పైపులే తాగునీటి కుళాయిలు
- 80 కుటుంబాలకు రెండించుల నీళ్లు
- పైపులైన్లు, కుళాయిలు కరువు



మోటారుకు డ్రిప్పు పైపులు అమర్చిన దృశ్యం



డ్రిప్పు పైపుతో నీరు పట్టుకుంటున్న మహిళలు

సుండుపల్లె, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా ప్రజల కష్టాల్లో మాత్రం మార్పు కనిపించడం లేదు. కనీసం తాగునీటిని అందించడంలోనూ అధికారులు విఫలమవుతు న్నారు. సుండుపల్లె మండలంలోని వానరాచపల్లి దిగువ బిడికీలో సుమారు 80 గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వర్షాకాలమైనా వేసవి కాలమైనా వారికి నిత్యం తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. తాగడానికి గుక్కెడు మంచినీటి కోసం నిరీక్షణ తప్పడం లేదని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ కింద లక్షలాది రూపాయల నిధులు విడుదలయ్యాయి. ఇంటింటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని విడుదల చేసిన నిధుల ఊసే కనిపించడం లేదు. పల్లెల్లో ట్యాంకులు నిర్మించి పైపులైన్లు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటిని అందించాలన్న సంకల్పంతో విడుదలైన లక్షలాది రూపాయల నిధులను వైసీపీ నాయకులు, అధికారులు స్వాహా చేసినట్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫిర్యాదులు చేశారు. నిధులు స్వాహా చేసినట్లు విచారణలో తేలినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆ నిధులను సక్రమంగా వినియోగించి ఉంటే ప్రస్తుతం వానరాచపల్లి దిగువ బిడికీలో ప్రజలు డ్రిప్పు పైపులైన్ ద్వారా నీరు తాగాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడేది కాదని స్పష్టంగా తెలుసుకోంది. సుమారు 40 డ్రిప్పు పైపులు ఒకపైపునకు ఏర్పాటు చేసి ఇంటింటికి ఆ పైపును అమర్చుకొని అక్కడి కుటుంబాలు కాలయాపన చేస్తున్నాయి. ఒక బిందె నీరు ఒక కుటుంబానికి చేరాలంటే గంటల కొద్దీ నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి అధికారంలోకి వచ్చాక బోరు వేశారంతే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వానరాచపల్లి ఉత్తర భాగంలో గుట్టలో ఒక బోరు వేశారు. ఆ బోరులో రెండు ఇంచుల నీరు పడింది. మోటారు, స్టాటరు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఆ తర్వాత పైపులైన్ ఏర్పాటు చేయకుండా గతంలో వేసిన పాత బోరుకు ఈ నీటిని మళ్లించారు. ఆ నీటితో ప్రజలు కాల యాపన చేస్తున్నారు. పైపులైన్ ఏర్పాటు చేసి ఇం టింటికీ కుళాయి పెడితే అరకొరగా తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని గ్రామస్థులు చెబుతున్నారు. శాశ్వత తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు. పంచాయతీలో సుమారు రూ.20 లక్షల వరకు నిధులు ఉన్నా తాగు నీరు అందించలేకపో తున్నారని గ్రామస్థులు తెలిపారు. కాగా ఈ వోపీ ఆర్‌డీ సురేశ్ బాబు, పంచాయతీ కార్య దర్శులు, ప్రజా ప్రతి నిధులు వానరాచపల్లి బిడి కీకి వెళ్లి నీటి సమస్యపై ఆరాతీశారు. సమస్యను పరిష్కరిస్తామన్నారు.

నీరు సరిపోవడం లేదు



తాగునీటి కోసం నిరంతరం కష్టాలు తప్పడం లేదు. కుటుంబానికి సరిపడా నీరు అందకపోవడంతో ట్రాక్టర్ ద్వారా నీటిని తెప్పించుకుంటున్నాం. పైపులైన్ ఏర్పా టు చేయాలని అధికారులకు చెబుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. కుటుంబానికి సరిపడా తా గునీటిని అందించి పుణ్యం కట్టుకోండి.

- శ్రీదేవి, వానరాచపల్లి బిడికి

తాగునీటి సమస్య లేకుండా చూస్తాం

తాగునీటి సమస్య లేకుండా చేస్తాం. సమస్యను ఈవోపీఆర్‌డీ దృష్టికి తీసుకెళ్లి పరిశీలించి వీలైనంత త్వరగా ప్రజలకు తాగు నీటిని అందిస్తాం. పైపులైన్ ఏర్పాటు చేసే విధంగా చూస్తాం.

- వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి మడితాడు-2

ఐదేళ్లుగా ఇదే కష్టం



తాగునీరు లేక ఐదేళ్లుగా కష్టపడుతున్నాం. వ్యవసాయ బోర్లలో కూడా వేసవి కాలంలో నీరు రావు. ట్యాంకర్ల ద్వారా అరకొరగా నీటిని తోలి చేతులు దులు పుకుంటున్నారు. పైగా పైపులైన్ లేకపోవడం వల్ల బిందెల ద్వారా నీరు తెచ్చుకోవాలంటే ఇబ్బంది పడుతున్నాం. తాగునీటి సమస్య లేకుండా చూడండి.

- సోనేనాయక్, వానరాచపల్లి బిడికి

'ప్రతి నెలా మొదటి వారంలోనే జీతాలు చెల్లించాలి'



నిరసన తెలుపుతున్న సీఐటీయూ, సీపీఐ నాయకులు

గాలివీడు, జూలై24(ఆంధ్రజ్యోతి): గాలివీడు మండలం తూముకుంట గ్రామం టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ పీ4, పీ5లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు ప్రతి నెలా మొద టి వారంలోనే జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంశివ, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం సెక్యూరిటీ గార్డుల నిరసనకు ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ పీ4, పీ5లో పనిచేస్తున్న దాదాపు 38 మంది సెక్యూరిటీ గార్డులకు నేటికీ 24 రోజులు గడిచినా ఇంతవరకు వేతనాలు చెల్లించడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సెక్యూరిటీ గార్డులకు సకాలంలో వేతనాలు చెల్లించని కాంట్రాక్టు సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు. సోలార్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సెక్యూరిటీ గార్డులకు సోలార్ ప్రాజెక్టు వద్ద భద్రతా పరికరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే కాంట్రాక్టర్ స్పందించి సెక్యూరిటీ గార్డులకు వేతనాలు చెల్లించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ముబారక్, సెక్యూరిటీ గార్డులు పుల్లయ్య, శబరీశ్, నాగరాజు, హేమకుమార్, రవీంద్ర, రమేశ్‌నాయక్, రమణ, సుధాకర్, నరేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హరిత గ్రామ సాధనే లక్ష్యం



మొక్కలు నాటుతున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

నందలూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : హరిత గ్రామ సాధనే లక్ష్యమని ఎస్ఐ మన్నెం రామ్మోహన్ పేర్కొన్నారు. గురువారం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంచే క్రమంలో వృక్షో రక్షతి రక్షితః అన్న సూక్తిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. మొక్కలు నాటడం ద్వారా ప్రకృతిని పరిరక్షించడం కోసం అందరూ భాగస్వాములై కలిసి రావాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తనికంటి వెంకటనారాయణ, వాకర్స్‌క్లబ్ సభ్యులు మోడపోతల రాము, గంధం గంగాధర్, గురుప్రసాద్, మంటి మారయ్య, జంగంశెట్టి హరి పాల్గొన్నారు.

వీరచౌడేశ్వరిదేవి జయంతి సందర్భంగా అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలోని పాతబస్టాండ్ సమీపంలో వీరచౌడేశ్వరిదేవి జయంతి సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి అమ్మవారి జయంతి సందర్భంగా పేద ప్రజలకు ఆకలి తీర్చడంలో అన్నదాన కార్యక్రమం ఎంతో ఉపయోపడుతోందన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.హరిప్రసాద్, బీజేపీ మండల ఉపాధ్యక్షులు డాక్టర్ రేణుప్రసాద్‌రాజు, బీజేపీ జిల్లా నాయకులు హిమగిరియాదవ్, తోట నగేష్ పట్టణ ఉపాధ్యక్షులు పి.మహేష్, ఎస్సీమోర్చ పట్టణ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, కె.హరిప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు తక్షణం రద్దు చేయాలి : సీపీఐ, సీపీఎం

రాజంపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు వెంటనే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రవికుమార్‌లు డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో టీడీపీ నేతలు విద్యుత్ చార్జిల పెంపుదలను వ్యతిరేకించారని, స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలగిస్తామని ఎన్నికల్లో వాగ్దానాలు చేశారన్నారు. ఆదానితో సెకీ ద్వారా చేసుకున్న ఒప్పందం ద్వారా 25 ఏళ్లల్లో ప్రజలపై 1.10 లక్షల కోట్ల అధనపు బారం పడుతుందని, తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. నేడు కూటమి నేతలకు ఇవేమి పట్టనట్లు ఉన్నారని తెలిపారు. ప్రజలపై భారాలు వేస్తే ప్రజా వ్యతిరేక ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరామకృష్ణదేవర, పట్టణ కార్యదర్శి ఇ.సికిందర్, నాయకులు నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వరంగ పరిరక్షణకు కృషి చేయాలి'

రైల్వేకోడూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ప్రభుత్వరంగ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు తుమ్మల రాధాక్రిష్ణయ్య తెలిపారు. గురువారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు ఉద్యోగ భద్రత లేదన్నారు. ఏపీఎండీసీలో పనిచేస్తున్న ఉద్యోగులు సుమారు 15 నుంచి 20 సంవత్సరాల నుంచి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, ట్రైనింగ్ ఉద్యోగులుగా ఉంటున్నారన్నారు. వీరిని రెగ్యులర్ చేయాలన్నారు. ఏపీఎండీసీ సంస్థపై రాజకీయ శక్తుల ప్రాబల్యం ఎక్కువగా ఉందన్నారు.

అమ్మవారికి విశేష పూజలు



సంబేపల్లె, జూలై24(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలంలోని దేవపట్ల గ్రామ పరిధిలోని సీఎం కొత్తపల్లిలో చౌడేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవం గ్రామస్తులు గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జయంతి సందర్భంగా ఆలయం సుందరంగా అలంకరించబడింది. అమ్మవారికి పుష్పాలు, పట్టు వస్త్రాలు, ఆభరణాలతో విశిష్టంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శంఖనాదాలు, మంగళ వాయిద్యాల నడుమ వేపండితులు వేడుకలు ప్రారంభించి ప్రత్యేక పూజలు, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామునే పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవాలయం దీపాల కాంతులతో, పూల తోరణాలతో అలంకరించబడింది. ఈ జయంతి ఉత్సవం గ్రామంలో భక్తిశ్రద్ధల సమన్వయాన్ని, సంస్కృతిని ప్రతిబింబించేలా మార్చింది.

ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి

రేణుకా యల్లమ్మకు పూజలు



గాలివీడు, జూలై24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూలివీడు పంచాయతీ నాగూరు వాండ్లపల్లెకు సమీపంలో వెలిసిన రేణుక యల్లమ్మ అమ్మవారికి, బోరెడ్డిగారిపల్లెలోని చౌడమ్మ అమ్మవారికి ఆయా గ్రామ ప్రజలు ఘనంగా బోనాలు పట్టారు. బాణసంచా పేల్చుతూ ఊరేగింపుగా అమ్మవారి గుడి దగ్గరికి వెళ్లి అక్కడ పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

ప్రభుత్వ భూమి కబ్జా యత్నం అడ్డగింత



కంచె ఏర్పాటు కోసం నాటిన రాళ్లు

సుండుపల్లె, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సొంతంవారిపల్లె గ్రామ పంచాయతీ గడ్డమీదపల్లెలోని ప్రభుత్వ భూ మిలో అదే గ్రామానికి చెందిన కొంత మంది దౌర్జన్యంగా రాళ్లు తోలి కంచె వేసే ప్రయ త్నాలు చేస్తున్నారని గ్రామస్తులు రెండు రోజుల క్రితం కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సమాచారం ఇవ్వాలని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌ను కోరారు. స్పందించిన తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందిని పంపించి, ఆ స్థలంలో కంచె వేయనీయకుండా అడ్డుకున్నారు. కంచె ఏర్పాటుకు నాటిన రాళ్లను తీసివేయాలని సూచించారు. రెవెన్యూ అధికారి, సర్వేయర్ సర్వే నిర్వహించి ఆ స్థలం కుంట గుండ్లపల్లి గ్రామం పరిధిలోని 904 సర్వే నెంబర్‌లోకి వస్తుందని, కుంట పోరంబోకుకు చెందిన ప్రభుత్వ స్థలమని నిర్ధారించారు. ఈ స్థలంలో ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

'ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం'

రాయచోటిటౌన్, జూలై24(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో లా అండ్ ఆర్డర్ అదుపులో లేకుండా పోయిందన్నారు. అంతకు ముందు మహిళల గురించి మాట్లాడిన పవన్‌కళ్యాణ్ ఇప్పుడు నోరు తెరవడం లేదన్నారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రి సంఘటన అతీగతీ లేదని, మొన్న గండికోట సంఘటన... ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో జరిగాయన్నారు. మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోతోందన్నారు.

బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



బొప్పాయి పంట దళారిని ప్రశ్నిస్తున్న రైతులు

చిట్వేలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయ ధర భారీగా తగ్గించడంతో ఆగ్రహించిన రైతులు గురువారం చిట్వేలిలో రైతులు రోడ్డెక్కారు. చిట్వేలి - కోడూరు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ఐదు రోజుల క్రితం బొప్పాయ ధర ఒక టన్ను 16 వేలు ఉండేదని, మూడు రోజుల క్రితం అది కాస్తా 14 వేలకు వచ్చిందన్నారు. ఇప్పుడు రూ.10 వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళారులు రైతులను దారుణంగా మోసం చేస్తున్నారని తమకు గిట్టుబాటు ధర రూ.16 వేలు కల్పించాలని డిమాండ్ చేశారు. దళారులు కుమ్మక్కు అయి రైతులను మోసం చేస్తూ దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ధరలు పెంచేవరకు ఈ పోరాటం పదిరోజులైనా కొనసాగిస్తామని రైతులు అంటున్నారు. ఈ కార్యక్రమంలో తుంగా శివక్రిష్ణ, గుండాల్‌రెడ్డి, గిరిరాజు, రవిరాజు, నారాయణ, శివరామిరెడ్డి, చిన్నారెడ్డి, నాని, కోటయ్య, ఈశ్వరయ్య, రెడ్డయ్య, నరసింహరాజు, మండల బొప్పాయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

'బొప్పాయి రైతులను ఆదుకోవాలి'

ఓబులవారిపల్లె, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయ రైతులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి జయరామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వై.కోటలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొప్పాయ రేట్లు పెంచకపోతే రైల్వేకోడూరులో రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

సమాచార హక్కు చట్టం ప్రజలకు పాశుపతాస్త్రం: ఏవో



మాట్లాడుతున్న సుబ్రమణ్యం

పెనగలూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : సమాచారహక్కు చట్టం ప్రజల చేతుల్లో పాశుపతాస్త్రమని మండల వ్యవసాయాధికారి వీఎస్‌కే సుబ్రమణ్యం అన్నారు. గురువారం నారాయణనెల్లూరు రైతు భరోసా కేంద్రంలో గ్రామ ప్రజలకు సమాచారహక్కు చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఏదేని ప్రభుత్వ కార్యాలయ వ్యవస్థ కార్యక్రమాల లోటుపాట్లు గురించి తెలుసుకోవాలంటే అర్జీదారుడు తెల్లకాగితంపై తనకు కావాల్సిన సమాచారాన్ని అప్పిలేట్ అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 2025 అక్టోబరు నెలలో భారత ప్రభుత్వం ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. సంస్థల్లో అడిగే సమాచారానికి మండల స్థాయిలో రూ.5 జిల్లా స్థాయిలో రూ.10 రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సంస్థ నుంచి లబ్ధిదారులు కోరే సమాచారానికి అయ్యే ఖర్చు అంతా లబ్ధిదారుడే భరించాల్సి ఉందన్నారు. 2005లో ఈ చట్టం అమల్లోకి రాకముందు పార్లమెంట్ విధానసభ, విధాన పరిషత్ సభ్యులకు మాత్రమే ఈ చట్టం ద్వారా సమాచారం అడిగి తీసుకునే హక్కు ఉండేదన్నారు. 2005లో ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రజలందరికీ అన్ని సమాచారాలు తెలుసుకునే హక్కు ఏర్పడిందన్నారు.

ప్రతిఒక్కరూ ఆర్థికంగా బలపడాలి



లక్ష్మీకి ఆర్థిక సాయం అందజేస్తున్న నీలి చెంగారావు

రాజంపేట టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ ఆర్థికంగా బలపడాలని సీఎం చంద్రబాబు పి 4 విధానాన్ని తీసుకొచ్చారని టీడీపీ నేత నీలి చెంగారావు తెలిపారు. గురువారం పట్టణంలోని సాయి నగర్ సచివాలయం 24వ వార్డులో ఎం.లక్ష్మీకి ఆసరాగా తన సొంత డబ్బు రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పి4 కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ పర్యావరణ కార్యదర్శి హర్షవర్ధన్, వార్డు వెల్ఫేర్ కార్యదర్శి సాయినాథ్, వార్డు డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి సాగర్, వార్డు అడ్మిన్ సెక్రటరీ బాదుల్లా, సాయినగర్ సచివాలయ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

పెనగలూరు: నిరుపేదలను గుర్తించి వారిని అభివృద్ధి చేసేందుకే ప్రభుత్వం పి4 పథకాన్ని రూపొందించిందని ఎంపీడీవో ఎస్.విజయరావు అన్నారు. గురువారం ఈటమాపురం గ్రామ సచివాలయంలో సర్పంచి మందపల్లి లక్షుమ్మ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ అంచనాల ప్రకారం 1523 కుటుంబాలు పి4 పథకానికి అర్హులుగా ఉన్నాయన్నారు. వీరిలో 74 కుటుంబాలను సర్వే చేయగా 59 మంది అర్హులుగా ఉన్నారన్నారు. పి4 పథకంలో లబ్ది పొందే కుటుంబాలను ప్రభుత్వం బంగారు కుటుంబాలుగా అభివృద్ధి చేస్తుందన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

రైల్వేకోడూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై గురువారం రైల్వేకోడూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎస్. మణి ఆధ్వర్యంలో శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న వీఏఏలు జీవామృతం, ఘనజీవామృతంపై అవగాహన కలిగి రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించి రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి అధిక దిగుబడులు పొందేలా చేయాలని సూచించారు.

కృషి, పట్టుదలతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యం



మాట్లాడుతున్న మానవతా సంస్థ సభ్యులు

రాయచోటిటౌన్, జూలై24(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, పట్టుదల మంచి నడవడికతోనే విద్యార్థులు ఉన్నతలక్ష్యాలను సాధించగలరని మానవత సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, అధ్యక్షుడు అంకం జయచంద్రారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మానవత సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నైతిక విలువల సమాజంలో జరుగుతున్న పరిణామాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెడ్మాస్టర్ సైరాభాను, ఉపాధ్యాయ సిబ్బంది, మానవత సంస్థ సభ్యులు రామచంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వేరుశనగ సస్యరక్షణ చర్యల్లో రైతులు



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతులు

సంబేపల్లె, జూలై24(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వేరుశనగ పంట సాగులో చీడ పురుగులు ప్రభావం కనిపిస్తోంది. పంట సాగు చేసినప్పటి నుండి తెగుళ్ల పురుగుల ప్రభావం పడడంతో పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఆకుల్లోని హరితాన్ని తొలచి రంధ్రాలు చేస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా వర్షపాతం పరిస్థితుల కారణంగా వేరుశనగ సాగు గణనీయంగా తగ్గిందని చెప్పవచ్చు. కార్తెలలో వర్షాలు కురవక పంటసాగు చేపట్టలేదు. పంట సాగు చేసిన రైతులకు తెగుళ్లు, పురుగుల ప్రభావం పడింది. దీంతో ఆందోళన చెందుతున్నారు. సస్యరక్షణ చర్యలు శరణ్యం అంటూ పిచికారీ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం సస్యరక్షణ చర్యల మందులపై రాయితీల ద్వారా అందిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

కనుచూపు మేరా బీళ్లే..!

తొలకరి వచ్చిందంటే చాలు భూములను సాగుకు సిద్ధం చేసుకోవడం.. వేరుశనగ విత్తన కాయల కొనుగోలు.. వాటిని విత్తడానికి సిద్ధం చేసుకోవడం వంటి పనులతో గ్రామాలు సందడిగా కనిపించేవి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. వరుణుడు ముఖం చాటేయడంతో వేరుశనగ సాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోయింది. ఫలితంగా ఎక్కడ చూసినా బీడు భూములే దర్శనమిస్తున్నాయి. అరకొరగా సాగైన వేరుశనగ పైరు కూడా వర్షం కురవకపోవడంతో వాడుముఖం పట్టింది. ప్రతి ఏటా వేరుశనగ సాగు చేస్తున్న రైతులు నష్టాలే చవిచూస్తున్నారు. దీంతో అప్పులు చేసి పంట సాగు చేస్తున్న రైతులకు ప్రతి ఏటా నిరాశే మిగులుతోంది. పదిరోజులుగా అడపాదడపా మేఘాలు ఊరిస్తూ చిరుజల్లులు కురుస్తున్నాయే తప్ప ఓ మోస్తరు వర్షం కూడా పడలేదు.


పర్తికోట సమీపంలో సాగుకు నోచుకోని భూములు

- ముఖం చాటేసిన వరుణుడు...
- ఖరీఫ్ సీజన్‌లో పొలాల్లో కనిపించని పైరు
- భారీగా పడిపోయిన సాగు విస్తీర్ణం
- వాడిపోయిన వేరుశెనగ

ములకలచెరువు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె, కురబలకోట, పెద్దమండ్యం మండలాల్లో ప్రతిఏటా ఖరీఫ్‌లో వర్షాధారంగా వేరుశనగ సాగు చేస్తారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో అప్పుడప్పుడూ వర్షాలు కురిసినా... తీరా విత్తనాలు విత్తే సమయంలో వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో సాగుకు సిద్ధమైన రైతన్నలకు నిరాశే మిగిలింది. 25 రోజుల క్రితం అరకొరగా కురిసిన వర్షాలకు కొందరు రైతులు వేసిన విత్తనం మొలిచినా, ఆ తర్వాత వర్షం కురవకపోవడంతో మొక్కలు వాడుముఖం పట్టాయి. వారం రోజుల్లోగా వర్షం కురవకపోతే ఆ మొక్కలు కూడా ఎండిపోయే అవకాశం ఉంది.


వర్షం లేక గిడసబారిన వేరుశెనగ పైరు

అంచనాలు ఉల్టా ..

తంబళ్లపల్లె నియోజవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 13,850 హెక్టార్లలో వేరుశనగ సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. అయితే నియోజకవర్గంలో కేవలం 1,475 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ సాగైంది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సాగు విస్తీర్ణం భారీగా పడిపోవడానికి కారణమని రైతులు అంటున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని మండలాల్లో సాగు విస్తీర్ణం వివరాలిలా ఉన్నాయి.

ప్రత్యామ్నాయ పంటలే దిక్కు..

సహజంగా జూన్ 15 నుంచి జూలై మొదటి వారం వరకు వేరుశనగ విత్తనం వేసేందుకు అనువైన కాలం. ఈ సమయంలో వర్షాలు కురవకపోవడంతో వేరుశనగ సాగుకు నోచుకోలేదు. దీంతో దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు ప్రత్యామ్నాయంగా కందులు, మొక్కజొన్న, ఉలవ సాగు చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

సాగు విస్తీర్ణం తగ్గడం ఇదే ప్రథమం

వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గిపోవడం 20 ఏళ్లలో ఇదే ప్రథమమని రైతులు చెబుతున్నారు. ప్రతిసారీ విత్తనాలు విత్తే సమయంలో వర్షం పడేదని అంటున్నారు. అప్పట్లో తీరా పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు ఎక్కువగా కురవడమో, సాగు సమయంలో వర్షాలు కురవకపోవడం వల్లో నష్టపోయేవాళ్లమంటున్నారు. ఈసారి మాత్రం గతానికి విరుద్ధంగా విత్తనం సమయంలోనే వర్షం కురవకపోవడంతోనే సాగు చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలం	టార్గెట్	సాగయింది
ములకలచెరువు	2924 హెక్టార్లు	510 హెక్టార్లు
కురబలకోట	1800 హెక్టార్లు	400 హెక్టార్లు
తంబళ్లపలె	3200 హెక్టార్లు	350 హెక్టార్లు
పెద్దతిప్పసముద్రం	2300 హెకార్లు	101 హెక్టార్లు
బి.కొత్తకోట	2106 హెక్టార్లు	64 హెక్టార్లు
పెద్దమండ్యం	1520 హెక్టార్లు	50 హెక్టార్లు

మేఘాల వైపు చూస్తున్నా...



25 రోజుల ముందు కురిసిన వర్షానికి రూ.1.50 లక్షలు ఖర్చు చేసి పది ఎకరాల్లో వేరుశనగ విత్తనం వేశాను. అప్పటి నుంచి వర్షం కురవకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. వారం రోజుల్లో వర్షం కురవకపోతే పైరు పూర్తిగా ఎండిపోతుంది. దీంతో వర్షం కోసం మేఘాల వైపు చూస్తు కుర్చున్నా. వరుణ దేవుడు కరుణ చూపకపోతే తీవ్ర నష్టమే.

- రమేశ్, కొట్టంవారిపల్లె

సాగు చేయలేకపోయా...



ప్రతి ఏడాది ఖరీఫ్‌లో ఐదు ఎకరాల వరకు వేరుశనగ సాగు చేసేవాడిని. ఈ సారివర్షం లేక సాగు చేయలేదు. గతంలో ఖరీఫ్‌లో ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా వేరుశనగ పంట కనిపించేది. ప్రస్తుతం బీడు భూములు కనిపిస్తున్నాయి. దేవళచెరువు పంచాయతీలో గతంలో 500 ఎకరాల వరకు వేరుశనగ సాగయ్యేది. ఇప్పుడు 20 ఎకరాలు కూడా సాగు కాలేదు.

- నరసింహారెడ్డి, కన్నెమడుగువారిపల్లె

ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహిస్తాం



వర్షాలు కురవక రైతులు వేరుశనగ సాగు చేయలేకపోయారు. ప్రస్తుతం విత్తనాలు విత్తే సమయం కూడా ముగియడంతో, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా చూస్తాం. ప్రస్తుతం కంది, మొక్కజొన్న, ఉలవ సాగు చేసుకోవచ్చు. రైతులు ఆందోళన చెందకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే మంచిది.

-స్రవంతి, వ్యవసాయశాఖాధికారి

ఆక్రమిత స్థలం.. పంచాయతీకి స్వాధీనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మదనపల్లె టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): సీటీఎం-1 గ్రామ పంచాయతీకి చెందిన రూ.30 లక్షల విలువైన స్థలాన్ని స్వాధీనం చేస్తూ రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత నెల ఒకటో తేదీన ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన 'వివాదాస్పద స్థలంలో బేస్‌మెంట్ నిర్మాణం' కథనంపై స్పందించిన రెవెన్యూ అధికారులు పంచాయతీ కార్యాలయం, జాతీయ రహదారి, రైల్వేలైను పక్కనే వున్న ఈ స్థలంపై ఆరా తీశారు. రెవెన్యూ ఏ-రిజిస్టర్‌లో సర్వే నెంబర్ 978/బి డాటెడ్ ల్యాండ్‌గా నమోదైందన్నారు. ఇందులోని 0.32 ఎకరాల విస్తీర్ణం గల భూమి గ్రామ పంచాయతీకి బదలాయించినట్లు తెలిపారు. ఈ స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులు పంచాయతీ కార్యదర్శికి సూచించారు.


పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకున్న స్థలం, పునాదులు

విజిలెన్స్, వాణిజ్య పన్నుల శాఖ మెరుపు దాడులు

- దుకాణం సీజ్

రైల్వేకోడూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం విజిలెన్స్, వాణిజ్య పన్నుల శాఖ అధికారుల మెరుపు దాడులు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఎస్పీ శివన్న, డీసీటీవో గీతావాణి మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరు పట్టణంలోని రాజ్ కన్వెన్షన్ పక్కనే ఉన్న హర్షవర్ధన్‌రెడ్డి ఆటో ట్రేడర్స్‌కు 2017లో జీఎస్టీ రద్దు అయినా.. అదే పేరుతో సంస్థను నిర్వహిస్తూ పన్ను ఎగవేశారని తెలిపారు. 2022 నుంచి హర్షవర్ధన్ ఆటో మొబైల్స్ అనే పేరుతో ఎలాంటి అనుమతులు, రికార్డులు లేకుండానే సంస్థను కొనసాగించడంతో ప్రభుత్వ ఆదాయానికి లక్షలాది రూపాయల మేరకు గండిపడిందన్నారు. దీంతో దుకాణాన్ని వీఆర్వో పీఆర్ ఈశ్వరయ్య సమక్షంలో స్థానిక పోలీసుల సహకారంతో పంచనామా చేసి సీజ్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ నాయకుల నారాయణ, డీసీటీవోలు ఖాజాహుస్సేన్, బాబుమోసెస్, మధుసూదన్‌రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ ఏసీటీవోలు కవిత, నాగేంద్ర, కరీం తదితరులు పాల్గొన్నారు.


హర్షవర్ధన్ ఆటో మొబైల్స్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

లారీ కిందపడి ఉత్తరప్రదేశ్ వాసి మృతి

మదనపల్లె అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక టమోటా మార్కెట్ యార్డులో లారీ కిందపడి యూపీ వాసి మృతి చెందాడు మదనపల్లె టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఐదేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 80 మంది బతుకుదెరువు నిమిత్తం మదనపల్లెకు తరలివచ్చి నీరుగట్టువారిపల్లె టమోటా మార్కెట్‌లో దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. వారిలో ఒకడైన కాశిగంజ్ జిల్లా, నంగులా తానాకు చెందిన మోర్‌సింగ్ (50) గురువారం రాత్రి టమోటా మార్కెట్‌లో పని చేస్తుండగా రివర్స్ తీసుకుంటున్న లారీ వెనక చక్రాల కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం వివరాలను సేకరించి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామచంద్ర తెలిపారు. మార్కెట్ యార్డులోని అతని సహచరులు, తమ ఊరివాళ్లు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు.


మోర్‌సింగ్ మృతదేహం

'టీచర్లను బోధనకే పరిమితం చేయాలి'

- ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి

పీలేరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి అరవ వేణుగోపాల్ రెడ్డి కోరారు. పట్టణంలో ఎస్టీయూ డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువుకు సంబంధం లేని యాప్‌లతో టీచర్ల సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఒక చోటి నుంచి మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా జాప్యం చేయడం సబబు కాదన్నారు. ఉపాధ్యాయులకు అందవలసిన ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో ఇవ్వకపోవడం తగదన్నారు. వాస్తవాలను గుర్తించి న్యాయమైన సమస్యలు సత్వరం పరిష్కరించాలని కోరారు. జిల్లాలో ఎస్టీయూను బలోపేతం చేయడం కోసం సత్వరం మండలాల వారీగా సభ్యత్వ నమోదు ప్రారంభించాలని నిర్ణయించారు. డివిజన్ లో మండల కమిటీలతో సమావేశాలు నిర్వహించి నిర్ణీత గడువులోపు మెంబర్‌షిప్ కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో యూనియన్ నేతలు మహేశ్వర్ రెడ్డి, లోకనాథరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, డాక్టర్ జనార్ధన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బాల వెంకట్రమణ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ధర్మవరం-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ వారం రోజులు రద్దు



కలికిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నుంచి విజయవాడ, తిరుపతి, పీలేరు, కలికిరి మీదుగా ధర్మవరం వరకూ నడిచే ఎక్స్‌ప్రెస్ సర్వీసులను వారం రోజులపాటు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. 17247 నెంబరుతో నర్సాపూర్ నుంచి ధర్మవరం వరకు నడిచే సర్వీసు ఆగస్టు 11 నుంచి 18 వరకు రద్దు కానుంది. 17248 నెంబరుతో ధర్మవరం నుంచి నర్సాపూర్‌కు నడిచే సర్వీసును ఆగస్టు 12 నుంచి 19వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. ఈ సర్వీసుల కోసం ఈ తేదీల్లో ఇది వరకే టికెట్లు రిజర్వు చేసుకున్న వారికి ప్రత్యామ్నాయ మార్గాల వెసులుబాటు కోసం సర్వీసులు రద్దు చేస్తున్నట్లు సందేశాలు కూడా పంపింది. విజయవాడ-గూడూరు స్టేషన్ల మధ్య పెదవడ్లపూడి, దుగ్గిరాల, తెనాలి జంక్షన్, సుందూరు స్టేషన్ల మధ్య డబ్లింగ్ నుంచి ట్రిప్లింగ్ (మూడు లేన్‌లు), విద్యుదీకరణ, ఇతర పనులు జరుగుతున్న కారణంగా ఈ సర్వీసులను రద్దు చేస్తున్నారు. ఈ మార్గంలో మొత్తం 49 ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్, ప్యాసింజర్ సర్వీసులు కూడా వివిధ తేదీల్లో రద్దవుతున్నాయి.

సైబర్ నేరస్థుడి అరెస్టు

- కడపలో అదుపులోకి తీసుకున్న ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు

ఖమ్మంక్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ టీచర్‌ను బెదిరించి సుమారు రూ. 26 లక్షలు వసూలు చేసి మోసం చేసిన కేసులో ఒకరిని ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు కడప జిల్లాలో అరెస్టు చేసినట్లు ఖమ్మం సీపీ సునీల్ దత్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలానికి చెందిన రిటైర్డ్ టీచర్‌కు నిందితుడు ఫోన్ చేశాడు. హ్యూమన్ ట్రాఫికింగ్, మనీలాండరింగ్‌కి పాల్పడ్డావని బెదిరించారు. తాము బెంగుళూరు పోలీసులమని, డిజిటల్ అరెస్టు చేస్తామని హెచ్చరించారు. దీంతో భయపడిన సదరు ఉపాధ్యాయుడు ఏప్రిల్ 2025లో పలు దఫాలు గా సుమారు రూ.26లక్షలు వారి ఖాతాకు జమ చేశాడు. ఈక్రమంలో రూ. 20లక్షలు అకౌంట్‌కి వెళ్లిన దామ విజయ్‌కుమార్ అనే యువకుడిని అన్నమయ్య జిల్లా, లక్కిరెడ్డిపల్లి గ్రామంలో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారని తెలిపారు.

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలి

- అధికారులకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ సూచన


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), జూలై24(ఆంధ్ర జ్యోతి): ప్రజలందరూ సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బందిసేవలందించాలని, ఇందుకు సంబంధించిన మార్గ దర్శకాలను, బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి లోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేదరికం లేని సమాజం పీ4 కార్యక్రమం, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచిఅభిప్రాయాల సేకరణ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ చామకూరి శ్రీధర్, సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పీ4 కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని, మార్గదర్శి బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేసి ఆగస్టు 15 కల్లా పూర్తయ్యేలా చూడాలన్నారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి లేకుండా చూడాలని, ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించిన వాటిపై సమీక్షిస్తూ ఇసుక లభ్యత, విద్యుత్ అన్నివేళలా అందించడం, విద్యుత్‌లో ఓల్టేజ్ సమస్యలు లేకపోవడం వంటి అంశాల్లో ప్రజలందరూ సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనల మేరకు సంబంధిత శాఖల వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పీజీఆర్ఎస్ దరఖాస్తులపై సత్వరం స్పందించండి

- సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

బి.కొత్తకోట, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌యస్) దరఖాస్తులపై సత్వరం స్పందించి పూర్తి ఆధారాలతో సరైన నివేదికను ఇవ్వాలని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన బి.కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే, హౌసింగ్, పీజీఆర్‌యస్ అర్జీలతో పాటు పలు రెవెన్యూ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి వీఆర్వోను విడివిడిగా పిలిచి ఆయా గ్రామపంచాయతీలోని తాజా పరిస్థితిపై ఆరా తీశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్దేశిత అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలతో సిద్ధంగా ఉండాలని, వివిధ సమస్యలపై ప్రజలు పెట్టుకునే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబాజాన్, డీటీ బాలాజీ, ఆర్ఐ వీరాంజనేయులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మున్సిపల్ వైస్ చైర్మన్‌పై హత్యాయత్నం కేసు

రాయచోటిటౌన్, జూలై24(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డిపై అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు... రాయచోటి పట్టణ పరిధిలోని మిట్టవాండ్లపల్లె వద్ద గల సర్వే నెంబర్ 553లో రిటైర్డ్ డీఈ మండెం ఆదినారాయణరెడ్డికి 50 సెంట్లు పట్టా భూమి ఉంది. ఆ స్థలంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి తన కల్యాణ మండపానికి సిమెంటు రోడ్డు వేశాడు. దీనిపై వారి మధ్య వివాదం నడుస్తోంది. గురువారం ఆదినారాయణరెడ్డి తన భూమిలో సిమెంటు రోడ్డు వేయడాన్ని అడ్డుకున్నాడు. దీంతో దశరథరామిరెడ్డి మారణాయుధాలు కలిగిన సుమారు 20 మందితో కలసి ఆదినారాయణరెడ్డి కుటుంబ సభ్యులను చంపే ప్రయత్నం చేశాడని రాయచోటి పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో దశరథరామిరెడ్డితో పాటు అతని అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటచలపతి తెలిపారు.

ఆకతాయికి దేహశుద్ధి

గుర్రంకొండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): కళాశాలల వద్ద అమ్మాయిలను వేధిస్తున్న ఆకతాయికి ఓ బాలిక తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. పట్టణంలోని కాలేజీలు, పాఠశాలలు వద్ద విద్యార్థినులకు ఆకతాయిల వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో పాఠశాలలు, కాలేజీలకు వెళ్లాలంటేనే బాలికలు హడలిపోతున్నారు. మధ్యాహ్నం, సాయంకాలం ఆకతాయిలు ద్విచక్ర వాహనాల్లో తిరుగుతూ బాలికలను ఇబ్బంది పెడుతున్నారు. విద్యార్థినులకు బలవంతంగా ఫోన్ నెంబర్లు ఇచ్చి బెదిరిస్తున్నారు. కొందరు విద్యార్థినులు ఆకతాయిల వేధింపులు తల్లిదండ్రులకు చెప్పలేక ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తనను ప్రేమించాలంటూ ఓ యువకుడు గురువారం మధ్యాహ్నం ఓ విద్యార్థినిని వేధించాడు. ఈ విషయాన్ని ఆమె ఫోన్ ద్వారా తన తండ్రికి తెలియజేసింది. దీంతో కాలేజీ వద్దకు వచ్చిన విద్యార్థిని తండ్రి ఆ యువకుడిని చితకబాదాడు. విషయాన్ని కాలేజీ అధ్యాపకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆకతాయి యువకుడిని పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. పట్టణంలో ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

నిమ్మనపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేస్తుండగా పాముకాటు వేయడంతో ఓ మహిళ పరిస్థితి విషమంగా మారింది. గురువారం జరిగిన ఈ సంఘటనపై బాధిత కుంటుంబీకుల కథనం మేరకు వెంగంవారిపల్లి పంచాయతీ బాలినాయునిపల్లి గొల్లపల్లివాసి పాలేటి భార్య మంగమ్మ ఎర్రచెరువు వద్ద వ్యవసాయ పనులు చేస్తుండగా కాలికి పాము కాటు వేసింది. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకుంది. పరిస్థితి గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తాళి కట్టు శుభవేళ..!



- నెల రోజులపాటు ఊపిరాడని ముహూర్తాలు
- వివిధ శుభ కార్యాలకు సమాయత్తం
- కల్యాణ మండపాల బుకింగ్ ఫుల్
- నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- నెల రోజుల విరామంతో వరుస ముహూర్తాలు

కలికిరి/బద్వేలు టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మంచి ముహూర్తమనే పేరు ఎత్తకుండానే నెల రోజులపాటు బేజారెత్తించిన ఆషాఢ మాసం ముగిసింది. గురుమూఢం వైదొలగి శ్రావ్యమైన శ్రావణ మాసానికి తలుపులు బార్లా తెరచింది.. అడుగడుగునా శుభ ముహూర్తాలతో ఈ నెల రోజులపాటు ఎడతెరిపి లేకుండా పెళ్లి బాజాలు మోగేందుకు సిద్ధమయ్యాయి. జూలై చివరి వారం నుంచి ఆగస్టు మూడో వారం వరకూ పెళ్ళిళ్లు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు వంటి శుభ కార్యాలకు తగిన 15 ముహూర్తాలున్నాయి. ఆషాఢ మాసానికి ముందే నిశ్చితార్థాలు పూర్తయిన వారు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఇప్పటికైతే కల్యాణ మండపాలన్నీ పూర్తిగా బుక్ అయిపోయాయి. ఆలస్యంగా ముహూర్తాలు పెట్టుకున్న వారు కనీసం చిన్నపాటి ఫంక్షన్ హాలు కూడా దొరక్క బెంబేలెత్తిపోతున్నారు. వరుణ దేవుడు మన్నిస్తే ఇంటిపట్టునే ఆరుబయట పందిళ్ళేసి మమ అనిపించేందుకు కూడా సిద్ధపడుతున్నారు. శుభ లేఖలు పంపిణీ, ఆభరణాల కొనుగోలు, వంట సామాగ్రి సమీకరణ, బాజా భజంత్రీలు, అలంకరణలు వంటివాటిపై దృష్టి పెట్టారు. మరో వైపు కేటరింగ్ లేదా వంట మాస్టర్ల ముందస్తు నిర్ణయాలు కూడా పూర్తయ్యాయి. ఇప్పుడిప్పుడే ఆడంబరాల కోసం బారాత్‌లాంటి వ్యవహారాలపై రిహార్సల్స్ మొదలు పెట్టేవారూ వున్నారు. శ్రావణ మాసంలో జూలై 26, 30, 31 తేదీల్లో ముహూర్తాలు ప్రారంభమవుతుండగా ఆగస్టులో దాదాపు 12 రోజులు శుభ ముహూర్తాలున్నాయి. అనంతరం 18 నుంచి సెప్టెంబరు 20 వరకూ భాద్రపద మాసంలో పూర్తిగా ముహూర్తాలు ఉండవు. ఆపైన సెప్టెంబరు 24 నుంచి నాలుగు రోజులు, అక్టోబరు నెలాఖరు వరకూ 13 రోజులు, ఆ తరువాత నవంబరులో మరో 13 రోజులు ఆశ్వయుజ, కార్తీక మాసాల్లో ముహూర్తాల సందడికి కొదవుండదు.

శ్రావణ మాసంలో ఆధ్యాత్మిక సందడి

ఒక వైపు శుభ ముహూర్తాలతో తెలుగు లోగిళ్ళు శ్రావణ మాసంలో కళకళలాడనుండగా మరో వైపు ఈ మాసమంతా ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది. ప్రధానంగా మహిళలకు.. అందునా నూతన వధువులకు మంగళగౌరీ వ్రతాలతో తీరికుండదు. రుద్రాభిషేకంలాంటి శివారాధనలకు ఈ మాసం విశిష్టమైనదిగా చెపుతారు. జీవ నదుల్లో శ్రావణ మాస స్నానాలు కూడా పవిత్రంగా భావిస్తారు. ఈ మాసంలో చంద్రుడు, శుక్రుడు శక్తివంతంగా ఉంటారని కూడా శాస్త్రాలు చెపుతాయి. ఇక శ్రావణ పౌర్ణమిని రాఖీ పౌర్ణమిగా కూడా భావిస్తారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలపై చెప్పాల్సిన పనిలేదు. మొత్తం మీద శుభ ముహూర్తాలు ఒక వైపు ఆధ్యాత్మిక సందడి మరో వైపు.. ఈ నెల రోజులూ హడావుడిగా ఉండనున్నాయి.

ఆగస్టులో 10 రోజుల సెలవులు

శ్రావణ మాసంలో ముహూర్తాల జోరుకు తగ్గట్లు ఆగస్టు నెలలో వరుస సెలవులు కూడా కలిసొస్తున్నాయి. ఆగస్టు 3 ఆదివారం, 8న వరలక్ష్మి వ్రతం, 9, 10 రెండవ శనివారం, ఆదివారాలు, 15న స్వాతంత్ర్య దినోత్సవంతోపాటు వరుసగా మూడు రోజులు అంటే 16 కృష్ణాష్టమి, 17న ఆదివారంతో వరుస సెలవులున్నాయి. ఇక ఆగస్టు 24 ఆదివారం, 27న వినాయక చవితి, మళ్లీ 31 ఆదివారంతో నెలంతా వెసులుబాటు కలుగుతోంది. ఈ నెలలో ఐదు ఆదివారాలు రావడం, మామూలుగా సెప్టెంబరులో వచ్చే వినాయక చవితి కూడా ఆగస్టులోనే రావడం బాగా కలిసొస్తోంది.

ప్రమాణ స్వీకారాలకు ఇదే సమయం

ఇక రాజకీయాల్లో కూడా ఒక రకమైన సందడి ఈ నెలలో కనపడనుంది. ఇటీవలే ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సహకార సంఘాలకు నామినేటెడ్ కమిటీలను నియమించింది. ఇన్నాళ్ళు మంచి ముహూర్తాలు లేక వేచి చూస్తున్న ఆ కమిటీల నాయకులు ఈ నెలలోనే ప్రమాణా స్వీకారాలకు కూడా ముహూర్తాలు పెట్టుకున్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ఎప్పుడో..!

- ఇంటర్ ఫలితాలు విడుదలై మూడు నెలలైనా..
- నోటిఫికేషన్ విడుదల చేయని విద్యాశాఖ
- ఎదురు చూస్తున్న విద్యార్థులు, యాజమాన్యాలు

కడప ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు వెల్లడించి మూడు నెలలుపైనే గడుస్తున్నప్పటికీ డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ మొదలు కాకపోవడం గందరగోళానికి దారితీస్తోంది. ప్రవేశాలు ఎప్పుడు కల్పిస్తారంటూ ఇటు విద్యార్థులు, అటు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికే ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ అడ్మిషన్లతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసింది. వివరాల్లోకి వెళితే...

ఉమ్మడి కడప జిల్లాలో 71 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ప్రైవేటు 52, ఎయిడెడ్ 5, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు 14 ఉన్నాయి. వీటిల్లో అడ్మిషన్ల కోసం లక్షల మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. అడ్మిషన్లు తీసుకోవాలంటే కళాశాలలు గుర్తింపు కోసం దరఖాస్తులు చేసుకోవాలి. అడ్మిషన్ల ప్రక్రియ గందరగోళంలో ఉండడంతో ఈ ఏడాది ఇప్పటి వరకు ఎవరు దరఖాస్తు చేయలేదు. ప్రభుత్వం నుంచి కమిటీ వచ్చి కళాశాలలో మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా పరిశీలించి గుర్తింపు పునరుద్ధరిస్తారు. ఇప్పటి వరకు ఇలాంటి ప్రక్రియ మొదలు కాలేదు.

గందరగోళానికి ప్రధాన కారణం

డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం కొనసాగించాలా... డబుల్ మేజర్ విధానం ప్రవేశపెట్టాలా.. అనే గందరగోళం నెలకొనడమే అడ్మిషన్ల జాప్యానికి కారణం. ఇప్పటి వరకు సింగిల్ మేజర్ విధానం నడుస్తోంది. ఈ ఏడాది నుంచి డబుల్ మేజర్ విధానం ప్రవేశపెడతామని, ప్రతి కళాశాల ఇందుకు అప్‌గ్రేడ్ చేయించుకోవాలని సూచించారు. ఆ మేరకు యాజమాన్యాలు నగదు చెల్లించి అనుమతి తీసుకున్నారు. విద్యార్థులకు డబుల్ మేజర్‌పై అవగాహన కల్పించారు. చాలా మంది తల్లిదండ్రులు దీనివైపు మొగ్గుచూపించారు. కానీ ప్రభుత్వం చివరకు సింగిల్ మేజర్ వైపు మొగ్గు చూపుతూ నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఇంతకుముందు ఆఫ్‌లైన్‌లోనే డిగ్రీ ప్రవేశాలకు అడ్మిషన్లు జరిగేవి. వైసీపీ వచ్చాక ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టింది. ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో ప్రవేశాలు కల్పించే అవకాశం ఉందని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. దీనిపై కూడా అయోమయం నెలకొంది.

విడుదల కాని బకాయిలు

ప్రభుత్వ కళాశాలలకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికీ విడుదల కాలేదు. దీంతో కళాశాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. బకాయిలను విడతల వారీగా విడుదల చేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటి వరకు విడుదల చేయలేదు. 2023-24కు మూడు క్వార్టర్లు, 2024-25కు మూడు క్వార్టర్లకు బకాయిలు విడుదల చేయాలి. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు.



కడప ఆర్ట్స్ కళాశాల (ఫైల్)

సింగిల్, డబుల్ మేజర్ విధానం అంటే...

డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం అంటే విద్యార్థి ఒకే ఒక్క ప్రధాన సబ్జెక్టును మేజర్ తీసుకొని మిగిలిన సబ్జెక్టులను మైనర్‌గా గానీ, సపోర్టివ్‌గా గానీ చదవాలి. ఉదాహరణకు బీఎస్సీ (ఫిజిక్స్) అంటే... ఫిజిక్స్ ప్రధాన మేజర్ సబ్జెక్టు. మిగిలిన సబ్జెక్టులు కెమిస్ట్రీ, మేథ్స్ వంటివి సపోర్టివ్ ఉంటాయి. డబుల్ మేజర్ అంటే డిగ్రీలో రెండు ప్రధాన సబ్జెక్టులను మేజర్ తీసుకొని చదవాలి. ఉదాహరణకు బీఏ (హిస్టరీ, పొలిటికల్ సైన్స్) ఇక్కడ హిస్టరీ, పొలిటికల్ సైన్స్ రెండూ మేజర్ సబ్జెక్టులు. రెండింటిని సమాన ప్రాముఖ్యతతో చదివి, రెండింటిపైనా లోతుగా అవగాహన పెంచుకుంటారు.

ఇతర కోర్సుల వైపు విద్యార్థులు..

ప్రభుత్వ నిర్ణయం ఆలస్యం కారణంగా ఇప్పటికే డిగ్రీలో చేరాలనుకునే వేలాది విద్యార్థులు ఇంజనీరింగ్ ఇతర కోర్సుల వైపు వెళుతున్నారని యాజమాన్యాలు చెబుతున్నాయి. గత ఏడాది అడ్మిషన్లు బాగా పడిపోయాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో మరింత అడ్మిషన్లు తగ్గిపోయే ప్రమాదం ఉంది.

ప్రకృతి వ్యవసాయ సాగును విస్తరింపజేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్

కడపరూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగును మరింత విస్తరింప చేయాలని వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్ పేర్కొన్నారు. కడప నగరంలోని ఏడీఏ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై మూడురోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలను తెలిజేసి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలన్నారు. విచక్షణా రహితంగా వాడుతున్న రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రవిచంద్ర అరటి, నిమ్మ వంటి ఉద్యాన పంటలను ప్రకృతి వ్యవసాయం ద్వారా ఏ విధంగా పండించవచ్చునో తెలియజేశారు. కడప సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్‌వీ సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జీవామృతం, కషాయాలు ఏవిధంగా తయారు చేయాలో తెలుసుకుని రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా డీపీఎం ప్రవీణ్, కడప వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఏవోలు, రైతుసేవా ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

చీని, నిమ్మ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చీని, నిమ్మ పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి కోరారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులు చీని, నిమ్మ తోటలు సాగుచేస్తారన్నారు. అయితే ఈ ఏడాది ధరలు పూర్తిగా పడిపోవడంతో రైతుల తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే మార్కెట్‌యార్డుల్లో నిల్వ ఉన్న వాటిని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ధ్రువకుమార్‌రెడ్డి, సయ్యద్ గౌస్‌పీర్, అశోక్‌రెడ్డి, సిరాజుద్దీన్, మాజీ కార్మిక సంఘ రాష్ట్ర చైర్మన్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే ఆపండి

కడప సెవెన్‌రోడ్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని తక్షణమే ఆపకపోతే పెద్దఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం సీపీఎం జిల్లా కార్యాలయంలో విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ విద్యుత్‌చార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తెర వేసే టైం ఆఫ్ డే టార్ఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణమని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు అమర్చే కాంట్రాక్ట్‌ను అదానికి కట్టబెట్టారని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్, మనోహర్, అన్వేష్, శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పీఎఫ్ వెంటనే అకౌంట్‌కు జమచేయాలి

- ఉపాధ్యాయ సంఘాల వినతి

కడప ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు 2022 జనవరి నెల ప్రీమియం ఇంత వరకు జమ చేయలేదని, వెంటనే జమ చేయాలని పీఎస్‌టీయూ వైఎస్ఆర్‌టీఏ నాయకులు లెక్కల జమాల్‌రెడ్డి, సజ్జల రమణారెడ్డి, వెంకటనాథ్‌రెడ్డి, రమేష్, అమర్‌నాథరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ రామగోవిందరెడ్డి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందిస్తూ ప్రావిడెంట్ ఫండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ నాగిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డిని పిలిపించి వెంటనే 2022 జనవరి పీఎఫ్ ప్రీమియంవెంటనే అకౌంట్‌కు జమచేయాలని ఆదేశించారు.

విషద్రావణం తాగి వ్యక్తి ఆత్మహత్య



కమలాపురం రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాపాఘ్ని పాత బ్రిడ్జి కింద సయ్యద్ రసూల్ (52) విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు... కడపకు చెందిన సయ్యద్ గురువారం ఉదయం కమలాపురంలో ఉంటున్న తన కుమార్తె జైబీన్ ఇంటికి వచ్చాడు. కుమార్తె ఇంటి వద్ద లేకపోవడంతో తిరిగి కడపకు బయలుదేరాడు. 11 గంటల సమయంలో తన కుమార్తెకు ఫోను చేసి తనను దేవుడు రమ్మంటున్నాడని, పాపాఘ్ని నది సమపంలోని బ్రిడ్జి వద్ద విష ద్రావణం తాగానని, మీ అమ్మను జాగ్రత్తగా చూసుకోమని చెప్పి ఫోన్ కట్ చేశాడు. దీంతో అప్రమత్తమైన అతని కుమార్తె కుటుంబసభ్యులతో కలిసి సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు కమలాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ విద్యాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూవివాదంలో వైసీపీ నాయకులు అరెస్టు

మైదుకూరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భూవివాదమై మన్యం రాణి అనే మహిళపై కొడవలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో కొందరు వైసీపీ నాయకులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డమాయపల్లె గ్రామంలో నివశిస్తున్న మన్యం రాణి వారి దాయాదుల మధ్య భూ వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఆమె ఇంటిలో ఉండగా... మన్యం రమేష్‌రెడ్డి, మన్యం రజిత, మన్యం సిద్దారెడ్డి, మన్యం పెద్ద సిద్దారెడ్డి, మన్యం రామ్మోహన్‌రెడ్డి కొడవలితో దాడికి పాల్పడ్డారు. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో యువకుడి..

కడప క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అల్మాస్‌పేటకు చెందిన బాలికను కిడ్నాప్ చేసిన కేసుకు సంబంధించి యువకుడిని అరెస్టు చేసినట్లు కడప టూటౌన్ ఎస్‌ఐ హుసేన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు ప్రొద్దుటూరు పట్టణం ఆంధ్రకేసరి వీధికి చెందిన మునిశ్రావణ్‌కుమార్ ఇంటర్ వరకు చదివి ఖాళీగా ఉంటున్నాడు. ఈనెల 16న అల్మాస్‌పేటకు చెందిన బాలికను బలవంతంగా ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లాడు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసి గురువారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి మృతి

పోరుమామిళ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని శీనప్ప బావివీధికి చెందిన చెన్నంశెట్టి సుబ్బరాయుడు (34) కడుపు నొప్పి తాళలేక అధిక మోతాదులో మందులు వేసుకోవడంతో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. పోరుమామిళ్లలో చెన్నంశెట్టి సుబ్బరాయుడు మెడికల్ స్టోరు నిర్వహించేవాడు. ఈనెల 22న కడుపు నొప్పిరావడంతో మందులు తీసుకున్నాడు. నొప్పి ఎక్కువ కావడంతో మరికొన్ని మాత్రలు వేసుకోవడంతో అస్వస్థతకు గురయ్యాడు. అతన్ని కుటుంబ సభ్యులు పోరుమామిళ్లలోని ప్రైవేటు ఆసుపత్రికి... మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాల లారీ ఢీకొని గేదెలు మృతి



కొండాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఓబన్నపేట గ్రామం వద్ద గురు వారం సాయింత్రం పాలలారీ ఢీకొనడంతో రెండు గేదెలు మృతి చెందాయి. ఇదే గ్రామా నికి చెందిన పెద్దగురప్ప అనే రైతు గేదెలను మేపుకొని రోడ్డు దాటుతుండగా తాడిపత్రి వైపు వెళుతున్న పాల లారీ గేదెలను ఢీకొంది. దీంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతిచెందగా, మరో గేదెకు గాయాలైనట్లు రైతు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, తనను ఆదుకోవాలని రైతు కోరారు.

31 మద్యం బాటిళ్లు స్వాధీనం

పోరుమామిళ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మద్యం బాటిళ్లు తీసుకెళుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. గురువారం సీతారామాపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పెద్దకప్పలనపల్లెకు చెందిన కప్పల శ్రీనివాసులు అక్రమంగా 31 మద్యం బాటిళ్లు తీసుకువెళుతుండగా స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

బద్వేలుటౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రోడ్డులోని స్థానిక పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో గురువారం ఆటోను ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో శ్రీనివాసులు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనం ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురాయి అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయండి

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్సీ ఫిర్యాదు



సీఎం చంద్రబాబుకు అక్రమ మైనింగ్ అరికట్టాలంటూ వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె మండలాల్లో అక్రమ ముగ్గురాయి (బెరైటీస్) మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. గురువారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి ఎమ్మెల్సీ వినతిపత్రం సమర్పించారు. కడప జిల్లాలోని వేముల, వేంపల్లె మండలాల్లో అపారమైన ముగ్గురాయి ఉందన్నారు. బ్రిటీష్‌కాలం నాటి నుంచి ఇక్కడ కొందరికి మైనింగ్‌కు అనుమతులు ఉండేవన్నారు. అన్నిటికి కాలపరిమితి ముగిసిందన్నారు. వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ ముగ్గురాయిని కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా వెలికితీసి అక్రమంగా కోట్లు గడిస్తున్నారన్నారు. ఈ ముగ్గురాయి వెలికితీసే సమయంలో ఎలాంటి రక్షణ లేకుండానే వెళ్లి మైనింగ్ సాగిస్తున్నారన్నారు. దీంతో అనేక ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయని తెలిపారు. వేముల మండలం గొంది పల్లెలో 275 సర్వే నెంబర్‌లో 705.43 ఎకరాలలో కృష్ణప్ప బెరైటీస్ కంపెనీకి గతంలో అనుమతులు ఉండేవన్నారు. ప్రస్తుతం ఎలాంటి లీజు లేదు, రెన్యువల్ కూడా కాలేదన్నారు. ఈ కంపెనీ దాదాపు రూ.6కోట్లు ప్రభుత్వానికి బకాయిలు ఉందన్నారు. ఇదే సర్వేనెంబర్‌లో కొందరు అక్రమ మైనింగ్ సాగిస్తున్నారన్నారు. రోజు వంద టన్నుల ఖనిజాన్ని వెలికితీసి టన్ను రూ.30 వేల నుంచి రూ.35వేలతో విక్రయిస్తున్నారన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రవాణా కూడా సాగిస్తున్నారన్నారు. సంబంధించిన భూయజమాని అక్రమంగా చేస్తున్నారని అధికారులకు మొరపెట్టుకున్నా ఎవరూ స్పందించడం లేదన్నారు. అలాగే వేంపల్లె మండలం కత్తులూరు వద్ద అక్రమ మైనింగ్ జరుగుతోందన్నారు. ఈ అక్రమ మైనింగ్‌లో రామచంద్ర అనే వ్యక్తి మృతిచెందాడన్నారు. మృతుని కుటుంబానికి రూ.12లక్షలు ఇచ్చి కేసు రాజీ చేసుకున్నారన్నారు. పులివెందుల నియోజకవర్గంలో విచ్చలవిడిగా బెరైటీస్ తవ్వకాలు చేస్తున్నారన్నారు. వేముల మండలం వేముల గ్రామ పరిధిలో టిఫెన్ కంపెనీకి లీజు ఉండేదన్నారు. ఆ సంస్థ రూ.10కోట్ల విలువైన ఖనిజాన్ని వెలికితీసి అక్కడే నిల్వ ఉంచిందన్నారు. రాత్రికి రాత్రే దీనిని అక్రమంగా తరలించి అమ్ముకున్నారన్నారు. అక్రమ మైనింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని గతంలో మీరే హెచ్చరించారని ఆయన పేర్కొన్నారు.

వీరమల్లు సినిమా ఫ్యాన్స్‌షోలో ఘర్షణ

కడప క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నటించిన హరహర వీరమల్లు చలనచిత్రం ప్రీమియం షో 23న రాత్రి విడుదలైంది. ఈ సందర్భంగా రాత్రి నగరంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న థియేటరు వద్ద పవన్ అభిమానుల మధ్య తొలుత వాగ్వాదం చోటుచేసుకుంది. చివరికి ఘర్షణకు దారితీసింది. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయితే ఇరువర్గాల మధ్య మాటామాటా పెరగడంతో పోలీసులు చొరవ తీసుకుని వారిని అక్కడ నుండి పంపించారు. అయితే ఈ ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయంపై కడప వన్‌టౌన్ పోలీసులను వివరణ కోరగా, సినిమా ప్రీమియం రిలీజ్ సందర్భంగా తోపులాట జరిగిందని, అయితే ఎవరు కూడా తమకు లిఖితపూర్వక ఫిర్యాదు చేయకపోవడంతో కేసులు నమోదు చేయలేదని తెలిపారు.

పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో మరోసారి వైద్యపరీక్షలు

పులివెందుల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలో జరిగిన హత్యాయత్నం కేసులో ఉన్న ఐదుగురికి పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో మరోసారి (గురువారం) వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇనగలూరు గ్రామంలో కత్తులతో దాడి చేసిన ఘటనపై జూలై 21వ తేదీ 11మందిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులో ఐదుగురిని జమ్మలమడుగు సివిల్ జడ్జికోర్టులో బుధవారం హాజరు పరచగా ఎస్‌ఐ విచక్షణారహితంగా కొట్టారని జడ్జికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మరోసారి వైద్యపరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. దీంతో గురువారం ప్రశాంత్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గంగిరెడ్డిలకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

27న సీనియర్స్ అండర్-23 మహిళల క్రికెట్ ఎంపికలు

కడపస్పోర్ట్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 27వ తేదీ ఆదివారం ఉదయం సీనియర్స్‌తో పాటు అండర్-23 మహిళల క్రికెట్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. 2002 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు అర్హులని... ఆసక్తి గల క్రీడాకారులు క్రికెట్ ఎంపికలకు హాజరు కావాలని కోరారు. హాజరయ్యే క్రీడాకారిణీలు ఆధార్‌కార్డు కాపీ, బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్, కిట్ బ్యాగ్‌లు వెంట తీసుకురావాలన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా గాలిచంద్ర



బద్వేలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో కడప జిల్లా 22వ మహాసభలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శిగా గాలిచంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులుగా జి.రామయ్య, ఎల్.నాగసుబ్బారెడ్డి, బి.చంద్రశేఖర్, ఎస్.వెంకటశివ, పి.సుబ్బరాయుడు, సుబ్రహ్మణ్యం,వి.వీరశేఖర్, సుబ్బారెడ్డి, వేణుగోపాల్, విజయలక్ష్మి, శ్రీరాములు, కేసీ బాదుల్లా, సురేష్, పి.బాలు, మద్దిలేటి, శంకర్‌నాయక్, వెంకటరాముడుతో పాటు 79 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర మాట్లాడుతూ జిల్లాలో ఉక్కుఫ్యాక్టరీతో పాటు పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గాలేరు- నగరి, తెలుగుగంగ, రాజోలి 2వ దశ పనులుపూర్తి చేయాలని, సోమశిల, గండికోట, గాలేరు-నగరి ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులకు వెంటనే పరిహారం, పునరావాసం కల్పించాలని, కడప -బెంగుళూరు రైల్వే పనులు పూర్తి చేయాలని, మూతపడ్డ చెన్నూరు ఫ్యాక్టరీ, ప్రొద్దుటూరు పాలకేంద్రం తెరిపించాలని మహాసభలో తీర్మానించినట్లు ఆయన తెలిపారు.

'వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణానికి అనుమతి కోరలేదు'

బ్రహ్మంగారిమఠం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి మాస కల్యాణోత్సవం జరిపేందుకు ఆగస్టు 6న నిర్వహించేందుకు తన అనుమతి కోరలేదని పూర్వ మఠాధిపతి వీరభోగవసంత వేంకటేశ్వరస్వామి ధర్మపత్ని మారుతీ మహాలక్షుమ్మ ప్రకటనలో తెలిపారు. మఠం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ స్వామివారి కల్యాణం గురించి తమ అనుమతి కోరలేదన్నారు. కుటుంబ సభ్యులందరూ నిర్ణయం తీసుకున్నారనేది అబద్ధమని తెలిపారు. తనకు పంపిన లెటరులో మఠం అర్చకుల ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకున్నారని ఉందని.. కానీ మీడియాకు జూలై 9న ఇచ్చిన పత్రికా ప్రకటనలో అర్చకుల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులందరూ నిర్ణయం తీసుకున్నట్లు తేడాగా ఉందన్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవానికి తన అనుమతి అసలు కోరలేదని, తనకు లెటరు పంపేనాటికి హైకోర్టులో స్టేటస్‌కో ఇచ్చి ఉన్నట్లు మహాలక్షుమ్మ తెలిపారు.

2003 డీఎస్సీ వారికి పాతపింఛన్ అమలు చేయాలి



మంత్రులకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేసి 2003 డీఎస్సీ వారికి పాతపింఛన్ అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సీపీఎస్‌ఈఏ రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి వెంకట జనార్దన్‌రెడ్డి కోరారు. గురువారం సచివాలయంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు అమలు చేసిన విధంగా సీపీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేస్తూ.. అదే కేంద్ర ప్రభుత్వం 2004కు పూర్వం రాతపరీక్ష రాసిన వారికి పాత పింఛన్ అమలు చేస్తూ జారీ చేసిన మెమో 57ను ఇప్పటి వరకు రాష్ట్రప్రభుత్వం అమలు చేయకపోవడం శోచనీయమని తెలిపారు. కేవలం 11000 మంది మాత్రమే ఈ మెమో ద్వారా లబ్ధిపొందుతారని వారికి వెంటనే పాతపింఛన్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 2003 డీఎస్సీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి రవీంద్రారెడ్డి, జిల్లా కన్వీనర్లు కురుకుటి సుధాకర్, రిజ్వాన్ అలి, ప్రొద్దుటూరు నియోజకవర్గం బాధ్యులు అచ్చుకట్ల చాంద్‌బాష, అనంతపురం జిల్లా కన్వీనర్ గజ్జల ప్రభాకర్, ప్రకాశం జిల్లా కన్వీనర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని పొలాలకు వాడుతున్నారని ఫిర్యాదు



సీవీ పల్లెలో ప్రభుత్వ బోరుకు అక్రమంగా అమర్చిన పైపులు

పెద్దతిప్పసముద్రం జూలై 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ప్రజలకు చేరాల్సిన తాగు నీరు పంట పొలాలకు వాడుతున్నారని గురువారం పులికల్లు పంచాయతీ సీవీ పల్లె ప్రజలు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌కు ఫిర్యాదు చేశారు. అవసరాలకు అమర్చిన బోరు నుంచి కొందరు అక్రమంగా పైపులను ఏర్పాటు చేసుకుని పంటలను సాగు చేసుకుంటూ తాగునీటికి కొరతను సృష్టిస్తున్నారని ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో కొందరు వైసీపీ నేతలు పంచాయతీ బోరుకు అక్రమంగా పైపులైన్ ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా పంటలను సాగుచేసుకుంటూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎంపీడీఓ గ్రామానికి వెళ్లి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శితో కలిసి అక్రమంగా ఏర్పాటు చేసుకున్న పైపులైన్‌ను తొలగించి తాగునీటి సమస్యను పరిష్కరించడంతో సమస్య పరిష్కారమైందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

రోగులపట్ల నిర్లక్ష్యం వద్దు

నిమ్మనపల్లి ప్రత్యేకాధికారి సతీష్ కుమార్



రికార్డులు తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్, తదితరులు

నిమ్మనపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఆస్పత్రిని ఎంపీడీఓ రమేష్‌తో కలిసి గురువారం ఆకస్మి తనిఖీ చేపట్టిన వారు రికార్డులు, హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఇద్దరు డాక్టర్లకు బదులు ఒకరే విధుల్లో ఉండడంపై డాక్టర్ గురించి ఆరా తీశారు. తనంతరం ఆస్పత్రి మరగుదొడ్లు పరిశీలించి మందులపై ఆరా తీశారు. కాగా ఆస్పత్రిలో ఒక నర్సు మాత్రమే వుండండతో రాత్రిళ్లు విధులు నిర్వర్తించేందుకు కష్టం మారిందని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రేగళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

పీలేరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి వద్దని పీలేరు మండల ప్రత్యేకాధికారి క్రిష్ణకిషోర్ తెలిపారు. రేగళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చి డాక్టర్ లేరన్న కారణంతో ఒక్క రోగి కూడా వెనుదిరిగి వెళ్లకూడదని సూచించారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే స్థోమత లేక పోవడంతో ఎక్కువ మంది గ్రామీణ రోగులు ఎక్కువ మంది వస్తున్నారని, అయితే వారికి నాణ్యమైన వైద్యం అందించాల్సిన బాధ్యత డాక్టర్లపై ఉందన్నారు. ఎంపీడీఓ శివశంకర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధామాధవి, సీహెచ్‌ఓ వీ. సరస్వతి, హెల్త్‌ఎడ్యుకేటర్ క్రిష్ణమ్మ, సూపర్‌వైజర్ చిన్నప్ప, పంచాయతీ కార్యదర్శి గుణశేఖర్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను నిర్లక్ష్యం చేయొద్దు : ఎమ్మెల్యే



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్యను నిర్లక్ష్యం చేయవద్దని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హెచ్చరించారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, వార్డు అమెనిటీస్ సెక్రటరీలతో ఎమ్మెల్యే సమీక్షిస్తూ వార్డు వారీ ఎన్ని బోర్లు వున్నాయి, ఎన్ని రోజులకు ఒక సారి తాగునీటి సరఫరా చేస్తున్నారని వివరాలు తెలుసుకున్నారు. చాలా చోట్ల బోరుమోటార్లు కాలిపోయినా ఫిట్టర్ ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. వర్షాకాలం వస్తోందని పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని శానిటరీ సూపర్ వైజర్లకు సూచించారు. ఏఈ రవీంద్రనాయక్, అమెనిటీస్ ఇన్‌చార్జి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన మదనపల్లె కాంగ్రెస్ నేత

మదనపల్లె, అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలను మదనపల్లె నేత సింగం రామకృష్ణారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గురువారం ఆంధ్రరత్న భవన్‌లో కాటన్ జయంతి సందర్భంగా చిత్రపటానికి షర్మిల నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం నేత సింగం రామకృష్ణారెడ్డి, నరసింహశెట్టి, నరసింహారావు, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆదాయం



ఎంపీఈఓలు, ఆర్‌ఎస్‌కేలకు శిక్షణ ఇస్తున్న ఏఓ నవీన్‌కుమార్

మదనపల్లె టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులు ఏడాది పొడవునా ఆదాయం పొందవచ్చని మదనపల్లె వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సీఎల్‌ఆర్సీ భవనంలో ఎంపీఈఓలు, ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. తొలకరి వర్షాలకు ముందే చేలల్లో ముందస్తుగా కలుపు తీసుకునే విధానంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో తీసుకోవాల్సిన పద్ధతులు, కషాయాలు తయారు చేసే విధానం గురించి వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. ఈ విధానాలపై మూడు రోజులు శిక్షణ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రమేశ్‌రాజు, రామసముద్రం, కురబలకోట ఏవోలు జాఫర్, మంజుల, అజిత, హెచ్‌ఓ ఈశ్వరప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

సమాచార హక్కును సద్వినియోగం చేసుకోవాలి



చట్టంపై అవగాహన కల్పిస్తున్న అధికారి శ్రీనివాస్

కలకడ, జూలై 24(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం 2005ను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ శ్రీనివాస్ రైతులకు సూచించారు. గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏదేని సమాచారం కావాలనుకున్న ప్రజలు నిర్ణీత రుసుం చెల్లించి సంబంధిత కార్యాలయంలో వివరాలను పొందవచ్చన్నారు. వ్యక్తిగత సమాచారం అడగరాదన్నారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

మినరల్ వాటర్ వర్కర్లకు వారంలో జీతాలు

పీలేరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు వారంలో పెండింగ్ జీతాలు చెల్లిస్తామని పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ లతీఫ్ ఖాన్ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్ జీతాలు చెల్లింపు ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చిందన్నారు. ఆలస్యం లేకుండా బకాయిలు చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. అయితే పట్టణంలో ఎక్కడా మినరల్ వాటర్ ఇవ్వకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్లాంట్లవద్ద సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. పెండింగ్ జీతాలు చెల్లించిన అనంతరం ప్రస్తుత వర్కర్లను తొలగించి పంచాయతీ వాటర్ వర్కర్లకు ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామన్నారు. పంచాయతీపై అదనపు బారం పడడం వల్లే ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకున్నామని తెలిపారు.

పేదలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

పేదరిక నిర్మూలనే 'పీ4' లక్ష్యం ● అర్హులైన కుటుంబాలను గుర్తించాలి

బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలి : జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ





పీలేరు సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి క్రిష్ణకిషోర్ - గోళ్లపల్లె గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ క్రిష్ణవేణి

పెద్దమండ్యం, జూలై 24(ఆంధ్రజ్యోతి): పేదలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి సమష్టిగా కృషి చేయాలని జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ పెద్దమండ్యం ఎస్‌ఓ కృష్ణ పిలుపు నిచ్చారు. గురువారం కలిచెర్ల, ఎన్‌ఓపల్లి, వెలిగల్లు సచివాలయాల వద్ద నిర్వహించిన 'పీ4' గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బంగారు కుటుంబాలను తీర్చిదిద్దడానికి నిరుపేద కుటుంబాలను ఎంపిక చేయాలని గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద కుటుంబాల అభివృద్ధి కోసం ఆర్థిక సహాయం అందించడానికి అన్ని అంశాలను పరిశీలించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధనకు ఐక్యంగా పని చేయాలన్నారు. నిర్లక్ష్యం ధోరణి కనబరచిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల పరిధిలో కేటాయించిన అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు. ఖచ్చితమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ఎంపీడీఓ శ్రీధర్‌రావు, సర్పంచులు విశ్వనాథ, పద్మావతి, సరస్వతి, ఏపీఓ సురేంద్రరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగవేణి, నౌజీయాబేగం పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే 'పీ-4' లక్ష్యం

పీలేరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనే లక్ష్యంగా 'పీ-4' (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్‌నర్‌షిప్) ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని పీలేరు ప్రత్యేకాధికారి, జిల్లా పరిశ్రమల అధికారి క్రిష్ణకిషోర్ తెలిపారు. గురువారం పట్టణం సహా గూడరేవుపల్లెలో 'పీ-4'పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో పేదరికంతో అట్టడుగు స్థానంలో ఉండి కనీస అవసరాలు తీర్చుకోలేని కుటుంబాలను గుర్తించి ఆర్థికంగా చేయూత నందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఉన్నత స్థితిలో ఉన్న వారు 20 శాతం మందిని దత్తత తీసుకుని వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎంపీడీఓ శివశంకర్, డిప్యూటీ ఎంపీ డీఓ లతీఫ్‌ఖాన్, కార్యదర్శులు జ్ఞానశేఖర్, శివాజీ, నవీన సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అర్హులైన కుటుంబాలను గుర్తించాలి

నిమ్మనపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): 'పీ-4'కు అర్హులైన కుటుంబాలను గుర్తించాలని ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్ పేర్కొన్నారు. నిమ్మనపల్లి, రెడ్డివారిపల్లి గ్రామ పంచాయతీల్లో 'పీ-4'పై ప్రజలకు అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ 506కుంటుబాలను గుర్తించామన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని పేదరికం నుంచి అభివృద్ధి వైపు నడిపించాలని కోరారు. ఇప్పటికే డాక్టర్లు, ఇంజనీర్లు, ఎన్‌ఆర్‌ఐలు, వ్యాపారులు ముందుకు వచ్చినట్లు తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌ను పొందే లబ్ధిదారుల మొబైల్ నెంబరు ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులతో సమీక్ష

తంబళ్లపల్లె, జూలై 24(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే 'పీ-4' ప్రధాన లక్ష్యమని తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీఓ థామస్ రాజ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో పీ-4పై సమీక్షించారు. మండలంలో 1,481 బంగారు కుటుంబాలను ఎంపిక చేయగా ఇప్పటికి 141 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. మిగిలిన వారిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి మార్గదర్శకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి పీ-4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ త్యాగరాజు, ఏపీఓ అంజనప్ప, ఏపీఎం గంగాధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్, కార్యదర్శి శ్రీనివాసరావు సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలపై గ్రామసభ

బి.కొత్తకోట, జూలై24 (ఆంధ్రజ్యోతి): 'పీ-4' పథకంపై గోళ్లపల్లెలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, గ్రామప్రజలు పాల్గొన్నారు.

తొగటవీరుల ఆరాధ్య దైవం

వేడుకగా చౌడేశ్వరీ దేవి జయంత్యుత్సవాలు ● మదనపల్లెలో రక్తదానం, అన్నదానం



మదనపల్లె చౌడేశ్వరీ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు - కుక్కలపల్లెలో.... సోంపాళ్యంలో... పీలేరులో చౌడేశ్వరిదేవి

మదనపల్లె అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణం, నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవి జయంతిని నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులు ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం, రక్తదానం, వైద్య శిబిరం నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చిన్నబాబు అమ్మవారి పూజ, అన్నదానంలో పాల్గొన్నారు. వైసీపీ ఇన్‌చార్జ్ నిషార్ అహమ్మద్ పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, సెక్రటరీ బండి పవన్ పాల్గొన్నారు.

కుక్కలపల్లెలో వేడుకగా....

పెద్దతిప్పసముద్రం జూలై 24 (ఆంధ్రజ్యోతి): తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవం చౌడేశ్వరీ మాత జయంతిని కుక్కలపల్లెలో వైభవంగా నిర్వహించారు. చౌడేశ్వరీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచీ అమ్మవారికి విశేషపూజలు చేశారు. చౌడేశ్వరీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి మేళతాళాలతో బళ్లారి డ్రమ్ములతో ఊరేగించారు. కమిటీ తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

మత్కోట చౌడేశ్వరిదేవి అమ్మవారు

ములకలచెరువు, జూలై 24(ఆంధ్రజ్యోతి): సోంపాళ్యంలో వెలసిన పురాతన మత్కోట చౌడేశ్వరిదేవి అమ్మవారి జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పాత ములకల చెరువులో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారి జయంత్యుత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పీలేరు చౌడేశ్వరి దేవి ఆలయంలో..

పీలేరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి రోడ్డులో ఉన్న చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం కలశ స్థాపన, 108 కలశాలతో ఊరేగించి అమ్మవారికి పాలాభిషేకం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ధర్మకర్త పల్లా కృష్ణయ్య, కార్యదర్శి వెంకటేశ్వర్లు, సభ్యులు భోజనపు శ్రీరాములు, రాధాకృష్ణ, చెంగల్రాయులు, పోలిశెట్టి సురేంద్ర, మదనమోహన్, పెద్దసంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'ఎస్పీ ప్రకటన హాస్యాస్పందం'

మదనపల్లె అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): బుద్ధుడి కొండపై పిల్లలు ఆటలో బుద్ధుడి తల విరిగిందని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు గురువారం ప్రకటన చేయడం హాస్యాస్పందంగా ఉందని బాస్ నేత పీటీఎం శివప్రసాద్ ఆరోపించారు. మదనపల్లెలో బుద్ధుడి విగ్రహం ధ్వంసం చేసిన నిందితులను గుర్తించామంటూ రాయచోటిలో ఎస్పీ మీడియా సమావేశం నిర్వహించడంపై అసహనం వ్యక్తం చేశారు. మదనపల్లె పోలీసులు ఎస్పీని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. నేరుగా బుద్ధుడి కొండపై జరిగిన సంఘటనను ఎస్పీ పరిశీలించి ఉంటే ఇలాంటి ప్రకటన చేసేవారు కాదన్నారు. ఇప్పటికైనా ఎస్పీ కొండను సందర్శించి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

స్టాప్ డయేరియాపై అవగాహన



చింతపర్తిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

వాల్మీకిపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): చింతపర్తి పీహెచ్‌సీ పరిధి బీసీ కాలనీలో స్టాప్ డయేరియాపై గురువారం తల్లులకు అవగాహన నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యురాలు జులేఖాబేగం మాట్లాడుతూ బిడ్డ ఎవరైనా సరే సమానంగా చూడాలని వ్యత్యాసం చూపరాదన్నారు. అతిసార వ్యాధి నియంత్రణలో చేతుల పరిశుభ్రత, ప్రాముఖ్యత చాలా ముఖ్యమని అందులోని ఆరుదశలను డెమో ద్వారా ప్రదర్శించి అవగాహన కల్పించారు. మరుగుదొడ్లలోనే మలవిసర్జన చేయాలని, తాగే నీటి విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం స్థానిక జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై పలు సూచనలు చేస్తూ పురవీధుల్లో ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫి, సీహెచ్‌ఓ అరుణ, సూపర్‌వైజర్‌లు బహుద్దీన్, భానుబీ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలి

మదనపల్లె టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఆదాయపన్నులశాఖ అధికారి మహ్మద్‌ఫారూఖ్ పేర్కొన్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ దినోత్సవం సందర్భంగా విజయభారతి హైస్కూల్లో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత దేశం ప్రపంచంలోని అగ్రరాజ్యాలతో పోటీ పడుతోందన్నారు. అంతేకాకుండా ఆర్థికంగా కూడా ఎదుగుతోందన్నారు. దేశం ఆర్థికంగా ఎదగడానికి పౌరులు వారి సంపాదనలో నిర్దేశిత మొత్తం ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించడం ఒక కారణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఎన్.సేతు, ప్రిన్సిపాల్ నిశ్చిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ



పిల్లలతో కలిసి భోజనం జేస్తున్న ఎంపీడీఓ, ప్రిన్సిపాల్

పెద్దతిప్పసముద్రం జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ స్థానిక మోడల్ స్కూల్ సహా మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. బాలికల వసతి గృహంలో బాలికలకు అందుతున్న భోజన వివరాలను, మెనూ ద్వారా అందిస్తున్నారా లేదా అని నేరుగా వారినే అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో బాలికలకు ప్రభుత్వం అందిస్తున్న చిక్కీలు, కోడిగుడ్లు, బూస్ట్, అరటిపండ్లు, రకరకాల కూరగాయలు, భోజనానికి వాడే బియ్యం తది వస్తువులను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ శివకుమారితో కలిసి ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అక్కడే భోజనం చేశారు. పాఠశాల మౌలిక వసతుల్లో భాగంగా కామన్ ప్రహరీ పాఠశాలకు మంజూరైందని త్వరలో టెండర్ ప్రక్రియ అనంతరం పనులను ప్రారంభిస్తారని తెలిపారు. పాఠశాలకు కావాలిసిన మౌలిక వసతులపై ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందించాలని వంట నిర్వాహకులను ఆదేశించారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలి

పెద్దమండ్యం, జూలై 24(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ, పెద్దమండ్యం ఎస్‌ఓ కృష్ణ పేర్కొన్నారు. మండలంలో ఆయన పర్యటించారు. పెద్దమండ్యం మోడల్ స్కూల్, కలిచెర్ల ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రజల ఆరోగ్యం, గ్రామాల అభివృద్ధికి అధికారులంతా కృషి చేయాలన్నారు. తహసీల్దార్ తేజశ్వి, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఏపీఓ సురేంద్రారెడ్డి, ఏపీఓ నరసింహులు, ఏఈ అక్రమ్, పంచాయతీ కార్యదర్శులు జనార్ధన, జగన్, సుబ్రమణ్యం, బాలాజీ, శైలజ, శేషాద్రి, గోవర్ధన, వరప్రసాద్ నాయక్, మంజుభార్గవి, ఖాదర్‌బాష, లక్ష్మీప్రసన్న, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

పెద్దమండ్యం, జూలై 24(ఆంధ్రజ్యోతి): సిద్దవరంలో జరిగిన ఉచిత వైద్యశిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కూటమి నేతల సహకారంతో తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఉచితంగా 200 మందికి వైద్య సేవలు అందించారు. కూటమి నేతలు ఎంపీటీసీ సభ్యుడు రుక్మాంగధరెడ్డి, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్, వైద్య బృందం, పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపు కోసం కృషి చేయాలి

కలకడ, జూలై 24(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపు కోసం కృషి చేయాలని ఎంపీడీఓ భానుప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన బాలికల గురుకుల పాఠశాలను గురువారం తనిఖీ చేసి మెనూను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి అందుతున్న వసతుల గురించి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆయేషాభాను, కార్యదర్శి నందినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల జోరు - కానరాని ఫాగింగ్

పీలేరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న ఓ మోస్తరు వర్షానికి పట్టణంలో పలు చోట్ల మురుగునీరు పేరుకుపోయింది. దీంతో దోమల బెడద రోజురోజుకూ అధికమౌతోంది. దోమల బెడద నుంచి ప్రజలకు విముక్తి కల్పించడం కోసం యుద్ధప్రాతిపదికన పట్టణంలో ఫాగింగ్ చేయించాల్సిన అవసరం ఉంది. రోడ్లపై మురుగునీటి గుంతలు, చెత్తకుప్పలు, మురుగు కాల్వలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో దోమలకు ఆవాసంగా మారింది. దోమల ధాటికి జనం రోగాలు బారిన పడుతున్నారు. అంటురోగాలు ప్రబలక ముందే ఫాగింగ్ చేయించాల్సి ఉన్నా ఫాగింగ్ యంత్రాలు పంచాయతీ కార్యాలయ స్టోర్ గదికే పరిమితం చేశారు.

రెవెన్యూ సమస్యలపై త్వరలో సదస్సు

మదనపల్లె టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలపై త్వరలో సదస్సులు నిర్వహిస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం పొన్నేటిపాళెం రామిరెడ్డిగారిపల్లెలో సుపరిపాలన- తొలిఅడుగులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రైతులు భూముల మ్యుటేషన్ చాలా ఆలస్యం చేస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అనంతరం 12మంది లబ్ధిదారులకు రూ.11లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మతాలకు అతీతంగా అందరి బాగుకోరే లౌకికవాది ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అని పోతబోలు దళితులు పేర్కొన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుద్దిళ్ల సుధాకర్ మాట్లాడుతూ పోతబోలులో రామాలయం నిర్మించాలని ఎమ్మెల్యేను కోరగా వెంటనే దేవదాయ మంత్రికి ఫోన్ చేసి రామాలయం నిర్మాణానికి రూ.45 లక్షలు కేటాయింపజేశారన్నారు.

డిగ్రీ కోర్సుల్లో సమస్యలను పరిష్కరించండి

మంత్రికి మాజీ సెనేట్ సభ్యుడు వినతి



మంత్రి లోకేశ్‌ను కలసిన ఎస్వీయూ మాజీ సెనేట్ సభ్యుడు గురుప్రసాద్

మదనపల్లె టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా డిగ్రీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎస్వీ యూనివర్శిటీ మాజీ సెనేట్ సభ్యుడు రాటకొండ గురుప్రసాద్ కోరారు. గురువారం విజయవాడలో మంత్రిని కలిసిన ఆయన మాట్లాడుతూ సింగిల్ మేజర్, డబుల్ మేజర్ సబ్జెక్టులపై ఇంకా స్పష్టత రాలేదన్నారు. దీని వలన విద్యాసంస్థలు ఆన్‌లైన్‌లో తీసుకోవాల్సిన ఆప్షన్ ఆలస్యమవుతోందన్నారు. మూడు ఇన్‌స్టాల్ మెంట్‌లు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో పలు విద్యాసంస్థలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, ప్రభుత్వం స్పందించాలని కోరారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

ములకలచెరువు, జూలై 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జరిగే 6వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. పార్టీ కార్యాలయంలో ముఖ్యులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆగస్టు 3వతేదీన బి.కొత్తకోటలో నియోజకవర్గ మహాసభ జరుగుతుందన్నారు. నియోజవర్గంలోని ఆరు మండలాల నుంచి మహాసభలకు తరలిరావాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి అంజనప్ప, నేతలు నిజాముద్దీన్, వేమనారాయణ, సుబ్బన్న, యల్లప్ప, శంకరప్ప, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.